News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 04 | సంచిక :351 | ఖమ్మం | శనివారం జనవరి 31, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



## మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా సునేత్ర

### నేడు ప్రమాణం చేసే అవకాశం

### పునరేకీకరణ దిశగా ఎన్సీపీ చీలిక వర్గాల కసరత్తు?

ముంబయి: అజిత్ పవార్ సతీమణి సునేత్రా పవార్ మహారాష్ట్ర తొలి మహిళా ఉపముఖ్య మంత్రి కానున్నారు. ఆమె శనివారం పదవీ స్వీకార ప్రమాణం చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. "ముంబయిలో రేపు పార్టీ పార్లమెంటరీ బోర్డు సమావేశమై సునేత్రను శాసనసభాపక్ష నాయకురాలిగా

మిగతా2లో



## ఇక సమాచార హక్కునూ చంపుతారా?

### ఆర్థిక సర్వే తీరుపై ఖర్గే ధ్వజం

దిల్లీ: సమాచార హక్కు చట్టాన్ని (ఆర్టీఐ) పునఃపరిశీలించాలని ఆర్థిక సర్వే పిలుపునిచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వ తీరుపై శుక్రవారం మండిపడ్డారు. ఎంజీనరేగా (మహాత్మాగాంధీ ఉపాధిహామీ చట్టం)ను చంపేశారు,

మిగతా2లో




# అడ్డగోలుగా అక్రమ మట్టి రవాణా

- అర్ధరాత్రి అయితే చాలు భయాందోళనలో గ్రామ ప్రజలు
- తహశీల్దార్ కు సమాచారం అందిస్తే అర్ధరాత్రి వేళలో మమ్మల్ని తొక్కేస్తారు
- పోలీసులకు సమాచారం ఇవ్వాలంటున్న తహశీల్దార్
- పోలీసులకు సమాచారం అందిస్తే తహసీల్దార్ ,మైనింగ్ వారికి సమాచారం ఇవ్వాలంటూ కాలయాపన
- ఒకరిపై ఒకరు తప్పించుకునే ప్రయత్నం
- మైనింగ్ కి ఎలాంటి పరిమిషన్ ఇవ్వలేదంటున్న స్థానిక తహశీల్దార్
- అక్రమ మట్టి రవాణా లో ఎవరి వాటా ఎంత?
- మట్టి డంపింగ్ స్థలం చూపిస్తామంటే స్థానిక జి పి ఓ ను పంపిస్తామని చెప్పి చర్యలు శున్యం
- అర్ధరాత్రి డంపింగ్ చేసిన మట్టి లొకేషన్ ఫోటోలు పంపిన చర్యలు ఏవి?
- నిద్ర మత్తులో మైనింగ్ అధికారులు

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని ఓ గ్రామ పంచాయతీ పరిధి లో గత ఇరవై రోజులు గా అర్ధరాత్రులు అక్రమ మట్టి రవాణా చేస్తున్న నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న స్థానిక అధికారులు అర్ధరాత్రులు లారీల హడావుడి తో గ్రామ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు వరి నాట్లు వేసిన భూమిలో అర్ధరాత్రులు మట్టి తొలి చదును చేసే ప్రయత్నం చేస్తున్నారని స్థానిక సర్పంచ్ అండ దండలతో అర్ధరాత్రులు విచ్చలవిడిగా మట్టి తొలకాలు నడుస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ ఖాజానాను గండి కొడుతున్న అక్రమార్కులపై అధికారులు చర్యలు తీసుకోకుండ అధికారులు అక్రమాదారులకు పబ్బం కడుతూ కాలయాపన చేస్తున్నారని గ్రామస్తులు మండి పడ్డారు ఇకనైనా అక్రమ మట్టి రవాణా అడ్డుకోకుండా డంప్ చేసిన మట్టి పై చర్యలు తీసుకోకపోతే పై అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు



## ఎర్రవల్లికి రాలేం

### కేసీఆర్ విజ్ఞప్తిని అంగీకరించని సిట్

### నందినగర్‌లోనే విచారిస్తామని వెల్లడి

### 1న అందుబాటులో ఉండాలని సూచన

ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విచారించే విషయంలో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) కీలక నిర్ణయం తీసుకుంది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలో తాను ఉంటున్న ఇంటికే వచ్చి విచారించాలన్న కేసీఆర్ విజ్ఞప్తిని తోసిపుచ్చింది. అక్కడకు రాలేమని చెబుతూ హైదరాబాద్‌లోనే విచారణకు హాజరు కావాలని స్పష్టం చేసింది. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ నందినగర్‌లోని నివాసంలో విచారణకు అందుబాటులో ఉండాలంది. ఈసారి తప్పనిసరిగా విచారణకు హాజరు కావాలని స్పష్టం చేసింది. ఈమేరకు శుక్రవారం రాత్రి 9.30 గంటల సమయంలో నందినగర్‌లో నోటీస్ ప్రతిని అందించింది. సిట్ అధికారులు వెళ్లిన సమయంలో అక్కడ ఎవరూ అందుబాటులో లేకపోవడంతో తొలుత ఇంటి గోడకు నోటీస్ ప్రతిని అంటించారు. కొద్దిసేపటి తర్వాత సిబ్బంది అందుబాటులోకి రావడంతో

మిగతా2లో

## పోలీసులకు "సారీ" చెప్పిన పాడి కౌశిక్ రెడ్డి...



- వీణవంక జాతరలో పోలీసులపై వివాదాస్పద వ్యాఖ్యలు
- విమర్శల నేపథ్యంలో క్షమాపణలు చెప్పిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి
- ఆవేశంలో నోరు జారానని, ఉద్దేశపూర్వకం కాదని వివరణ
- సీఎం ప్రోద్బలంతో తనపై కక్ష సాధిస్తున్నారని ఆరోపణ
- కౌశిక్ రెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు

మిగతా2లో

## మున్సి'పోల్స్'లో ముగిసిన నామినేషన్లు

- పురపోరుకు 28,456 నామినేషన్లు
- చివరిరోజు ఏకంగా 19,180 దాఖలు
- అనేక చోట్ల ఆసక్తికర పరిణామాలు
- మిర్యాలగూడ ఎమ్మెల్యే ఇంటి నుంచి ముగ్గురు రంగంలోకి..
- సూర్యాపేటలో బరిలో కర్నల్ సంతోష్‌బాబు తల్లి..

మిగతా2లో






## రేవంత్ రెడ్డి హార్వర్డ్ కోర్సు పూర్తి..

## తొలి సీఎంగా చరిత్ర

- హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ లో లీడర్ షిప్ కోర్సును పూర్తి చేసుకున్న రేవంత్
- సర్టిఫికెట్ అందించిన హార్వర్డ్ అధ్యాపకులు
- శిక్షణలో సాధారణ విద్యార్థిలా గడిపిన రేవంత్

మిగతా2లో

## అతడి భార్య అందంగా ఉందని పదవి ఇచ్చా..

## నోరు జారిన డోనాల్డ్ ట్రంప్..!



అమెరికా ఇంటీరియర్ సెక్రటరీగా డగ్ బర్గమ్ ను నియమించిన ట్రంప్

బర్గమ్ భార్య క్యాథరిన్ ఆకర్షణీయంగా ఉంటారని వ్యాఖ్య

ట్రంప్ పై వెల్లువెత్తుతున్న విమర్శలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసే వ్యాఖ్యలు ఒక్కోసారి చాలా విచిత్రంగా ఉంటాయి. తాను ఏం మాట్లాడినా చెల్లుతుంది అనే విధంగా ఆయన వ్యాఖ్యలు చేస్తుంటారు. తాజాగా ఇలాంటి సన్నివేశమే మరోసారి చోటుచేసుకుంది. అమెరికా ఇంటీరియర్ సెక్రటరీగా డగ్ బర్గమ్ ను ట్రంప్ నియమించారు.

మిగతా2లో

## నెలసరి ఆరోగ్యం ప్రాథమిక హక్కు:

## సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు

- జీవించే హక్కులో ఇది అంతర్భాగమని స్పష్టీకరణ
- పాఠశాలల్లో బాలికలకు ఉచితంగా శానిటరీ ప్యాడ్లు ఇవ్వాలని ఆదేశం
- అన్ని స్కూళ్లలో పరిశుభ్రమైన టాయిలెట్లు తప్పనిసరి అని సూచన
- కేంద్రం విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని తీర్పు

నెలసరి ఆరోగ్యం అనేది మహిళల ప్రాథమిక హక్కు అని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కులో ఇది అంతర్భాగమని సుప్రీంకోర్టు శుక్రవారం చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. పాఠశాలల్లో నెలసరి పరిశుభ్రత సౌకర్యాలు లేకపోవడం బాలికల విద్యాహక్కుకు, ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తోందని స్పష్టం చేసింది.జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పు ఇచ్చింది. దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6 నుంచి 12వ తరగతి చదివే బాలికలకు ఉచితంగా

మిగతా2లో



## సంజయ్ అగర్వాల్ కేసు..

## పీఎన్‌బీకి అప్పగింత

- ఘనశ్యామ్‌దాస్ జ్యూవెల్స్ మనీలాండరింగ్ కేసులో ఈడీ చర్యలు
- పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.16 కోట్ల ఆస్తుల అప్పగింత
- మోసంతో పొందిన బంగారాన్ని అమ్మి ఆస్తులు కొనుగోలు చేసిన యజమాని
- నకిలీ పాస్‌పోర్టుతో విదేశాల్లోనూ లావాదేవీలు జరిపిన సంజయ్ అగర్వాల్
- కోర్టు అనుమతితో రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని భూములను స్వాధీనం చేసిన ఈడీ

మిగతా2లో



# మేడారం జనసంద్రం.. పోటెత్తిన భక్తజనం

మేడారం: నిండు జాతర కళతో మేడారం వనమంతా పున్నమిని తలపించేలా వెలుగులీనుతోంది. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి చేరిన తర్వాతి రోజును నిండు జాతరగా పిలవడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో శుక్రవారం తల్లులను దర్శించుకునేందుకు భక్తులు భారీగా వరుస కట్టారు. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షల మంది ప్రజలు ఆర్టీసీ బస్సులు, సొంత వాహనాల్లో మేడారానికి చేరుకున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల నుంచి ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. భక్తులు ఎత్తు బంగారాన్ని ముట్టజెప్పడంలో పోటీ పడ్డారు. ఒడి బియ్యం, పసుపు, కుంకుమలను తల్లులకు సమర్పించారు.

**జనసంద్రంగా జంపన్నవాగు**

జంపన్నవాగు పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించగా పెద్దలు జల్లు స్నానాలతో తరించారు. జంపన్నవాగుకు ఇరువైపులా ఘాట్లలో ఉన్న కల్యాణకట్టల్లో భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. జంపన్నవాగు నుంచి పవిత్ర గద్దెల ప్రాంగణం వరకు ఇసుకేస్తే రాలనంత జనంతో కిటకిటలాడింది. నిండుజాతర వేళ మేడారానికి ప్రముఖులూ అధిక సంఖ్యలో వరుస కట్టారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతోపాటు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ఉన్నతాధికారులు తల్లులను దర్శించుకొన్నారు.

**నేటితో ముగియనున్న జాతర**

మేడారం మహాజాతర శనివారం సమ్మక్క వనప్రవేశం ఘట్టంతో ముగియనుంది. సాయంత్రం 4 గంటల తర్వాత ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. బుధవారం సారలమ్మ ఆగమనంతో ప్రారంభమైన జాతరకు గత మూడు రోజుల్లో 80 లక్షల మంది భక్తులు వచ్చి ఉంటారని అంచనా వేస్తున్నారు. చివరి రోజున భక్తుల రాక పెద్దసంఖ్యలో ఉంటుందని చెబుతున్నారు.

**రద్దీ నిర్వహణలో సమన్వయ లోపం**

మేడారం జాతర అంటేనే భక్తులు లక్షల సంఖ్యల్లో తరలివచ్చే వేడుక. వీరంతా గద్దెలపై కొలువైన అమ్మవార్లను దర్శించుకునే సందర్భంలో రద్దీ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణ కీలకం. కానీ, శాఖల మధ్య సమన్వయలోపం భక్తులకు అసౌకర్యం కలిగించింది. గద్దెల వద్దకు వెళ్లే దారి, క్యూలైన్లకు వెళ్లే మార్గాల సమాచారం తెలియక భక్తులు తికమకపడ్డారు. నెత్తిన ఎత్తు బంగారం బరువులను పెట్టుకొని వెనక్కి... ముందుకు... తిరుగుతూ అవస్థలు పడ్డారు. పోలీసులు తమ సిబ్బందిని ఇబ్బందులకు గురిచేయొద్దని, వారిని గద్దెల వద్ద విధులకు వదలండంటూ దేవాదాయశాఖ అధికారి మైకులో పలుమార్లు చెప్పడం గమనార్హం. ఇక ఉన్నతాధికారులు జారీచేసిన వీఐపీ, వీవీఐపీ పాస్‌లను సైతం శుక్రవారం అనుమతించలేదు. ఆయా పాస్‌లకు కేటాయించిన క్యూలైన్లను తొలగించడంతో సంబంధిత కార్డులతో వచ్చిన వారు నిరాశకు గురయ్యారు.

**స్తంభించిన ట్రాఫిక్**

శుక్రవారం పస్రా నుంచి తాడ్వాయి, మేడారం వరకు భారీగా ట్రాఫిక్ స్తంభించింది. వేల సంఖ్యలో వాహనాలు రెండున్నర గంటలపాటు చిక్కుకుపోయాయి. వాహనాల రాకపోకల నియంత్రణకు పోలీసులు పకడ్బందీ ప్రణాళికలు చేసినప్పటికీ... సమస్య తప్పలేదు. రద్దీ అధికంగా ఉన్న సమయంలో ఇలా జరగడం సహజమేనని వారు తెలిపారు.

**వనదేవతలను దర్శించుకున్న గవర్నర్ దంపతులు**

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు శుక్రవారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మను దర్శించుకున్నారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో హెలికాప్టర్ ద్వారా ములుగు జిల్లా మేడారం చేరుకున్న గవర్నర్.. కమాండ్ కంట్రోల్ రూం వద్ద పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. మంత్రి సీతక్క, ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌లు స్వాగతం పలికి.. ఆదివాసీల సంప్రదాయ నృత్యాలు, వాయిద్యాలతో గద్దెల వద్దకు తోడ్కొని వెళ్లారు. గవర్నర్ దంపతులు తులాభారం వేసి ఎత్తు బంగారాన్ని సమర్పించిన అనంతరం సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్ద రాజులను దర్శించుకున్నారు.

**ఊపిరాడక భక్తురాలి మృతి**

వన దేవతల దర్శనంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. సమ్మక్క రాక సందర్భంగా గురువారం రాత్రి సమయంలో గద్దెల వద్ద భక్తులకు దర్శనం నిలిపివేశారు. అప్పటికే వేల మంది జనంతో క్యూలైన్లు కిక్కిరిసి ఉన్నాయి. గంటల తరబడి వరుసలో నిల్చున్న సికింద్రాబాద్ వెస్ట్ మారేడుపల్లికి చెందిన శోభారాణి(68) క్యూలైన్లలో ఊపిరాడక అస్వస్థతకు గురై కింద పడిపోయారు. జనం రద్దీలో తొక్కిసలాట సందర్భంగా ఆమె అక్కడే ప్రాణాలు వదిలారు. రెస్క్యూ బృందం సభ్యులు అతికష్టం మీద మృతదేహాన్ని బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెస్ట్ మారేడుపల్లిలోని రెండు పడకల గదుల భవన సముదాయంలో నివసించే శోభారాణి... ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేసేవారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భర్త గతంలోనే మృతి చెందారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం మారేడుపల్లికి తీసుకొచ్చి. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. శోభారాణి కుటుంబ సభ్యులను స్థానిక కార్పొరేటర్ దీపిక ఓదార్చారు.

**మంత్రి అడ్లూరి కారు అద్దాలు ధ్వంసం**

గురువారం రాత్రి సమ్మక్క ఆగమనం అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వాహనంపై కొందరు బెల్లం సంచులతో దాడి చేశారు. గద్దెల వద్ద కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత రద్దీ రోడ్డులో నుంచి మంత్రి తిరిగి వెళుండగా జనం మధ్యలో కారు ఇరుక్కుపోయింది. కొందరు తమ చేతుల్లోని బెల్లం ముద్దల సంచులతో దాడి చేయడంతో కారు అద్దం ధ్వంసమైంది. మంత్రి వాహనం దిగి సమీపంలోని బెల్లం దుకాణంలోకి వెళ్లారు. రాత్రి 11 గంటల సమయంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడి, చీకటిగా ఉన్నప్పుడు రోడ్డుపైకి కారు రావడంతోనే ఆగ్రహంతో అలా చేసి ఉంటారని భావిస్తున్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి సమాచారం లేదని పోలీసులు చెబుతున్నారు.

# మున్సి'పోల్స్'లో ముగిసిన నామినేషన్లు

మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ల పర్వం పూర్తయింది. 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు కలిపి మొత్తం 28,456 నామినేషన్లు దాఖలయ్యాయి. మొదటి రెండు రోజుల్లో 9,276 నామినేషన్లు రాగా.. చివరి రోజైన శుక్రవారం 19,180 దాఖలు కావడం గమనార్హం. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, భారాస, భాజపాలతోపాటు ఆప్, తెలంగాణ రాజ్యాధికార పార్టీ, బీఎస్పీ వంటి పార్టీల నుంచి కూడా పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. నేతల కుటుంబాల నుంచి పలువురు బరిలోకి దిగగా.. కొన్నిచోట్ల దంపతులు పోటీకి సై అన్నారు. ఇలా అనేకచోట్ల ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. నామినేషన్ల పర్వం పూర్తి కావడంతో శనివారం నుంచి ప్రచారం ఊపందుకోనుంది. మహబూబాబాద్ మున్సిపాలిటీలో భారాస మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ కుమార్తె తేజస్విని 20 వార్డుకు నామినేషన్ దాఖలు చేశారు. చిట్యాల మున్సిపాలిటీ ఒకటో వార్డులో నాగిళ్ల సుధాకర్ ఎలియాస్ కావేరి అనే ట్రాన్స్‌జెండర్ రంగంలోకి దిగడం గమనార్హం. భూపాలపల్లి మున్సిపాలిటీలో భారాస తరఫున రెండు జంటలు రంగంలోకి దిగాయి. 4వ వార్డు నుంచి రేవుల రాకేశ్, 25వ వార్డు నుంచి ఆయన భార్య రేవుల స్రవంతి.. 29వ వార్డు నుంచి గండ్ర హరీశ్‌రెడ్డి, 10వ వార్డు నుంచి ఆయన భార్య శోభ నామినేషన్లు వేశారు.

నిర్మల్ మున్సిపాలిటీలో మూడు జంటలు నామినేషన్లు వేశాయి. భారాస తరఫున 30వ వార్డు నుంచి రాజేందర్, 40వ వార్డు నుంచి ఆయన భార్య మాధవి.. 37వ వార్డు నుంచి కాంగ్రెస్ తరఫున అప్పాల గణేశ్, 36వ వార్డు నుంచి ఆయన భార్య కావ్య.. 39వ వార్డు నుంచి కాంగ్రెస్ తరఫున తౌహీదుద్దీన్, 29వ వార్డు నుంచి ఆయన భార్య అయేషా కౌసర్ నామినేషన్లు వేశారు.

నల్గొండ జిల్లా చండూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ టికెట్ ఇవ్వలేదని బి.వేణు అనే వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు.

హుజూరాబాద్‌లో కొన్నిచోట్ల ఎంపీ ఈటల రాజేందర్, కేంద్ర మంత్రి బండి సంజయ్ వర్గాలకు చెందిన వారు భాజపా తరఫున నామినేషన్లు దాఖలు చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో కాంగ్రెస్, సీపీఐల మధ్య ఇంకా పొత్తు కుదరకపోవడంతో రెండు పార్టీల నుంచీ అభ్యర్థులు దాదాపు అన్ని వార్డులకూ నామినేషన్లు వేశారు. ఒకవేళ పొత్తు కుదిరే పక్షంలో దానికి అనుగుణంగా ఉపసంహరించుకోవాలన్నది వారి ఆలోచన.

**రంగంలోకి నాయకులు..**

నామినేషన్ల పర్వం ముగియడంతో అన్ని పార్టీలు ప్రచారంపై దృష్టి పెట్టాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన షెడ్యూల్ ఇప్పటికే దాదాపు ఖరారు కాగా.. భారాస, భాజపా నాయకులు కూడా వ్యూహరచనలో మునిగిపోయారు. ఉన్న కొద్దిపాటి సమయంలోనే ఓటర్లను ఆకర్షించేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. మరోపక్క ఆయా మున్సిపాలిటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నికలను సవాలుగా తీసుకొని కింది స్థాయి నాయకత్వాన్ని సన్నద్ధం చేస్తున్నారు.

# పోలీసులకు "సారీ" చెప్పిన పాడి కౌశిక్ రెడ్డి...

కరీంనగర్ జిల్లా వీణవంక సమ్మక్క-సారలమ్మ మినీ జాతర సందర్భంగా పోలీసులపై తాను చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. ఆవేశంలో నోరు జారానని, ఉద్దేశపూర్వకంగా అనలేదని ఆయన స్పష్టం చేశారు. పోలీసుల మనోభావాలు దెబ్బతిని ఉంటే క్షమించాలని కోరుతూ, ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని విజ్ఞప్తి చేశారు. గురువారం రాత్రి వీణవంక జాతరలో దళిత మహిళా సర్పంచ్‌ను కొబ్బరికాయ కొట్టనివ్వలేదని ఆరోపిస్తూ కౌశిక్ రెడ్డి కుటుంబంతో కలిసి నిరసనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదం జరిగి తోపులాట చోటుచేసుకుంది. ఆ సమయంలో కౌశిక్ రెడ్డి పోలీసులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలంను ఉద్దేశించి మాట్లాడుతూ, తమ ప్రభుత్వం వచ్చినప్పుడు అంతు చూస్తామని హెచ్చరించారు. ఈ ఘటన తర్వాత పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని, పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఐపీఎస్ అధికారుల సంఘం కూడా ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. ఈ నేపథ్యంలో కౌశిక్ రెడ్డి ఒక వీడియో సందేశం విడుదల చేశారు. "సీఎం ప్రోద్బలంతో నాపై, నా కుటుంబంపై రాజకీయ కక్ష సాధిస్తున్నారు. పోలీసులు, అధికారులంటే నాకు ఎంతో గౌరవం. జాతరకు వెళుతుండగా అడ్డుకుని తీవ్ర ఒత్తిడికి గురిచేశారు. ఆ ఫ్రస్టేషన్‌లో నోరు జారింది. నా వ్యాఖ్యల వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతింటే క్షమించాలి" అని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటన తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# సంజయ్ అగర్వాల్ కేసు.. పీఎన్‌బీకి అప్పగింత

సంచలనం సృష్టించిన ఘనశ్యామ్‌దాస్ జెమ్స్ & జ్యువెల్స్ మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక ముందడుగు వేసింది. ఈ కేసులో అటాచ్ చేసిన ఐదు స్థిరాస్తులను పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)కి అప్పగించింది. ప్రస్తుతం ఈ ఆస్తుల మార్కెట్ విలువ సుమారు రూ.16 కోట్లు ఉంటుందని ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు వివరించారు. ఘనశ్యామ్‌దాస్ జెమ్స్ & జ్యువెల్స్, దాని మేనేజింగ్ పార్టనర్ సంజయ్ అగర్వాల్‌పై సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ పేరిట నకిలీ బ్యాంక్ గ్యారెంటీలు సృష్టించి, వాటిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో సమర్పించి నిందితులు 250 కిలోల బంగారాన్ని మోసపూరితంగా పొందారని సీబీఐ ఆరోపించింది. ఈ మోసం బయటకు పొక్కగానే సంజయ్ అగర్వాల్, అతని సోదరులు అజయ్ కుమార్, వినయ్ కుమార్ అప్రమత్తమయ్యారు. పీఎన్‌బీకి తనఖా పెట్టిన హైదరాబాద్ అబిడ్స్‌లోని తమ దుకాణంలో ఉన్న బంగారం మొత్తాన్ని స్థానిక మార్కెట్లో నగదుకు విక్రయించారు. ఈడీ దర్యాప్తులో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. బంగారం అమ్మగా వచ్చిన సొమ్ముతో సంజయ్ అగర్వాల్ 2012 డిసెంబర్‌లో తన భార్య పేరు మీద కొత్త సంస్థను ప్రారంభించాడు. ఆ తర్వాత తన సోదరులు, ఒక ఉద్యోగి పేర్లతో మరో మూడు సంస్థలను ఏర్పాటు చేశాడు. అతని కుటుంబ సభ్యులు, నియంత్రణలో ఉన్న సంస్థల పేర్లతో తెరిచిన పలు బ్యాంకు ఖాతాలలో భారీగా లెక్కల్లో చూపని నగదు జమ అయినట్లు ఈడీ గుర్తించింది.

ఇంతటితో ఆగకుండా సంజయ్ అగర్వాల్ 'శ్రీకాంత్ గుప్తా' అనే నకిలీ పేరుతో పాస్‌పోర్ట్ సంపాదించి, పలుమార్లు విదేశాలకు ప్రయాణించాడు. అక్రమంగా సంపాదించిన డబ్బును మళ్లించడానికి అక్కడ కూడా అనేక బ్యాంకు ఖాతాలు తెరిచాడు. దర్యాప్తును మరింత లోతుగా చేయగా, తన ఉద్యోగి అవినాష్ సోనీ పేరుతో ఒక బినామీ ఆస్తిని కొనుగోలు చేసినట్లు తేలింది. ఈ ఆధారాలతో ఈడీ అధికారులు

2022 ఫిబ్రవరి 11న సంజయ్ అగర్వాల్‌ను అరెస్టు చేశారు. అతనికి, అతని కుటుంబ సభ్యులు, బినామీలకు చెందిన 9 స్థిరాస్తులను తాత్కాలికంగా అటాచ్ చేశారు. ఈ ఆస్తుల రికవరీకి సంబంధించి కోర్టును ఆశ్రయించగా, ఐదు ఆస్తులను పీఎన్‌బీకి అప్పగించేందుకు న్యాయస్థానం అనుమతించింది. వీటిలో తెలంగాణలోని రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఉన్న ఒక ప్లాట్, వ్యవసాయ భూములు ఉన్నాయి. 2011లో ఎఫ్ఐఆర్ నమోదైనప్పుడు ఈ ఆస్తుల విలువ రూ.2.55 కోట్లు కాగా, ప్రస్తుతం వాటి మార్కెట్ విలువ రూ.16 కోట్లకు చేరడం గమనార్హం.

# అతడి భార్య అందంగా ఉందని పదవి ఇచ్చా.. నోరు జారిన డోనాల్డ్ ట్రంప్..!

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, బర్గమ్ భార్య చాలా అందంగా ఉంటుందని... అందుకే ఆయనకు పదవి ఇచ్చానని అన్నారు. ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేస్తున్న సమయంలో బర్గమ్, ఆయన భార్య ఇద్దరూ అక్కడే ఉండటం గమనార్హం. బర్గమ్, ఆయన భార్య క్యాథరిన్ గుర్రపు స్వారీ చేస్తున్న వీడియోను తాను చూశానని... ఆ వీడియోలో ఆమె ఎంతో ఆకర్షణీయంగా కనిపించారని ట్రంప్ అన్నారు. ఆమె ఎవరని తన సిబ్బందిని తాను అడిగానని... ఈ జంట గురించి వారు తనకు వివరించగానే, తనకు ఒక అభిప్రాయం ఏర్పడిందని చెప్పారు. ఆ కారణంతోనే బర్గమ్ కు పదవిని ఇచ్చానని తెలిపారు. బర్గమ్ విజయవంతమైన బిజినెస్ మ్యాన్ అని చెప్పారు. రెండుసార్లు నార్త్ డకోటాకు గవర్నర్ గా చేశారని... ఆయన విజయం వెనుక ఆయన భార్య పాత్ర ఉంటుందని... వీరు అద్భుతమైన జంట అని అన్నారు.

క్యాథరిన్ గురించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. మహిళలను కించపరిచేలా ఆయన మాటలు ఉన్నాయంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో కూడా మహిళలపై పలుమార్లు ట్రంప్ అనుచిత వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

## ఇక సమాచార హక్కునూ చంపుతారా?

-మొదటిపేజీ తరువాయి

ఇక ఆర్టీఐ వంతా? అని నిలదీశారు. సమాచార హక్కు చట్టాన్ని ఒక పద్ధతి ప్రకారం బలహీనపరుస్తున్న మోదీ సర్కారు సత్యాన్వేషకులను శిక్షించే భయానక వాతావరణం సృష్టిస్తోందని 'ఎక్స్' ద్వారా ఆయన ధ్వజమెత్తారు. 2014 నుంచి ఇప్పటిదాకా వందమందికి పైగా ఆర్టీఐ కార్యకర్తలు హత్యకు గురయ్యారని వెల్లడించారు. "ఈ చట్టం కింద సమాచార వెల్లడి నిలిపివేతకు 'మంత్రుల వీటో'ను సూచించిన ఆర్థిక సర్వే ప్రభుత్వ రికార్డులకు ప్రజల పరిశీలన నుంచి రక్షణ కల్పించే యోచన చేస్తోంది. 2025 నాటికి ఆర్టీఐకి సంబంధించి 26,000 పెండింగు కేసులు ఉన్నాయి. ఈ చట్టానికి స్వతంత్ర కాపలాదారులుగా ఉన్న అధికారులను లొంగదీసుకునే ప్రయత్నాలను 2019 నుంచే ప్రారంభించారు" అని ఖర్గే నిరసన వ్యక్తం చేశారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ - 2023 ఆర్టీఐలోని ప్రజా ప్రయోజన నిబంధనను తుడిచిపెట్టిందన్నారు. ఆర్టీఐలో కీలకమైన చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ పోస్టును గత 11 ఏళ్లలో ఏడుసార్లు కావాలనే ఖాళీగా పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ సర్కారు 2014లో ఆమోదం తెలిపిన విజిల్ బ్లోయ ర్స్ రక్షణ చట్టాన్ని భాజపా సర్కారు ఇప్పటిదాకా అమలు చేయలేదని ఖర్గే గుర్తు చేశారు.

## మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా సునేత్ర

-మొదటిపేజీ తరువాయి

ఎన్నుకుంటుంది" అని ఎన్సీపీ నాయకుడొకరు తెలిపారు. సాయంత్రానికల్లా ఆమె ఉపముఖ్యమంత్రిగా పదవీ స్వీకార ప్రమాణం చేస్తారని ఆయన పేర్కొన్నారు.

మరోవైపు మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ ఆకస్మిక మృతి నేపథ్యంలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) చీలిక వర్గాల పునరేకీకరణను గురించిన ఊహాగానాలు ఊపందుకున్నాయి. చీలిక వర్గాల కలయికకు కసరత్తు జరుగుతున్న విషయం వాస్తవమేనని, ఇందుకు సంబంధించి అజిత్ పవార్ జీవించి ఉండగానే ప్రారంభమైన చర్చలు కీలక దశకు చేరుకున్నాయని అభిజ్ఞవర్గాలు పేర్కొన్నాయి. పుణె, చించ్వాడ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇరు వర్గాలు కలిసి పోటీ చేశాయి కూడా. రెండు చీలిక వర్గాలను విలీనం చేసే ఉద్దేశంతో గత కొంతకాలంగా అజిత్ పవార్ తన బాబాయి శరద్ పవార్‌తో అనేకమార్లు భేటీ అయ్యారని సమాచారం. శరద్ పవార్ వర్గానికి చెందిన సుప్రియా సూలే, జయంత్ పాటిల్‌తో కూడా చర్చలు జరిగాయి. భాజపా సీనియర్ నేతలకు ఈ పరిణామాల సమాచారం తెలుసునని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. చీలిక వర్గాల పునరేకీకరణ జరిగితే వ్యవస్థాపక నాయకుడైన శరద్ పవార్ సహజంగానే కేంద్ర స్థానాన్ని ఆక్రమించి పార్టీ శ్రేణులకు మార్గనిర్దేశం చేసే అవకాశం ఉంది. సునేత్ర ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తే పునరేకీకరణ ప్రయత్నాలకు విఘాతం కలుగుతుందా? అప్పుడు విలీనం కోరుకుంటున్న నాయకుల వైఖరి ఎలా ఉంటుంది? అన్నది వేచి చూడాల్సిందే. సునేత్రా పవార్‌ను పార్టీ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకోవడానికి ఎలాంటి అడ్డంకులూ లేవని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రఫుల్ పటేల్ శుక్రవారం స్పష్టం చేశారు. మరోవైపు రాష్ట్ర ఆర్థిక మంత్రిత్వ శాఖను నిర్వహించిన అజిత్ పవార్ మృతిచెందిన నేపథ్యంలో వచ్చే నెల శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ 2026-27 బడ్జెట్ సమర్పించే అవకాశాలున్నాయి.

**విచారణ ప్రారంభించిన సీఐడీ**

బారామతిలో ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణానికి దారితీసిన విమాన ప్రమాద ఘటనపై మహారాష్ట్ర నేర పరిశోధన విభాగం (సీఐడీ) విచారణ ప్రారంభించింది.

## నెలసరి ఆరోగ్యం ప్రాథమిక హక్కు: సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు

-మొదటిపేజీ తరువాయి

బయోడీగ్రేడబుల్ శానిటరీ న్యాప్‌కిన్లు అందించాలని ఆదేశించింది. పాఠశాలల్లో బాలికల కోసం ప్రత్యేక టాయిలెట్లు, నీటి వసతి, సబ్బుతో చేతులు కడుక్కునే సౌకర్యం తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. దివ్యాంగ బాలికలు కూడా సులభంగా వినియోగించేలా టాయిలెట్లు నిర్మించాలని సూచించింది. ఓ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై విచారణ సందర్భంగా కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. "విద్యాహక్కు అనేది ఇతర హక్కులను సాకారం చేసే 'మల్టిప్లయర్ రైట్'. నెలసరి పరిశుభ్రత సౌకర్యాలు లేకపోవడం వల్ల బాలికలు చదువుకు దూరమవుతున్నారు. గౌరవం అనేది ఓ ఆదర్శంగా మిగిలిపోకూడదు. అవమానం లేకుండా జీవించే పరిస్థితుల్లో అది కనిపించాలి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ తీర్పు నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'పాఠశాల బాలికల కోసం నెలసరి పరిశుభ్రత విధానాన్ని' అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తప్పనిసరిగా అమలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో ఇకపై నెలసరి ఆరోగ్య సంరక్షణ అనేది చట్టబద్ధమైన హక్కుగా మారింది.

## రేవంత్ రెడ్డి హార్వర్డ్ కోర్సు పూర్తి.. తొలి సీఎంగా చరిత్ర

:రాజకీయాలు, పాలనా వ్యవహారాలతో అనునిత్యం ఎంతో బిజీగా ఉండే తెలంగాణ ముఖ్యమంత్రి అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ లో 'లీడర్ షిప్ ఇన్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ: కాన్ఫ్లిక్ట్ అండ్ కరేజ్' ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న రేవంత్ కు హార్వర్డ్ అధ్యాపకులు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. అధికారంలో ఉండగానే ఈ సర్టిఫికెట్ పొందిన తొలి భారతీయ ముఖ్యమంత్రిగా రేవంత్ చరిత్ర సృష్టించారు. ఈ ప్రోగ్రామ్ లో ప్రపంచ వ్యాప్తంగా 20కి పైగా దేశాల నుంచి 62 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జనవరి 25న ఈ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ప్రారంభమయింది. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుదీర్ఘంగా క్లాసులు జరిగాయి. ఈ శిక్షణలో రేవంత్ సాధారణ విద్యార్థిలా గడిపారు. 21వ శతాబ్దంలో ప్రపంచానికి ఎదురయ్యే సవాళ్లు, నాయకత్వ మెళకువలు, సంక్షోభ పరిస్థితులను ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై కేస్ స్టడీలు, గ్రూప్ ప్రాజెక్టుల ద్వారా వీరికి శిక్షణ కొనసాగింది. మంచు తుపాను కారణంగా అక్కడి ఉష్ణోగ్రతలు -24 డిగ్రీలకు పడిపోయినప్పటికీ... విరామం తీసుకోకుండా రేవంత్ క్లాసులకు హాజరయ్యారు.

## ఎర్రవల్లికి రాలేం

- మొదటి పేజి తరువాయి

వారికి కాపీని అందించారు. వాస్తవానికి కేసు దర్యాప్తునకు అవసరమైన సమాచారాన్ని ఇచ్చేందుకు శుక్రవారం విచారణకు హాజరు కావాలని సిట్ గురువారం నోటీస్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దానిపై స్పందించిన కేసీఆర్ అదేరోజు సాయంత్రం సిట్‌కు బదులిచ్చారు. తనకు 65 ఏళ్లపైబడి వయసున్న కారణంగా 160 సీఆర్పీసీ సెక్షన్‌లోని అంశాలను పరిగణనలోకి తీసుకొని తన నివాసానికే రావాలంటూ సిట్‌ను కోరారు. అయితే మున్సిపల్ ఎన్నికల నామినేషన్లలో బిజీగా ఉన్నందున మరో తేదీన విచారించాలన్నారు. ఈక్రమంలో కేసీఆర్ స్పందనపై సిట్ శుక్రవారం ప్రత్యేకంగా భేటీ అయి చర్చించింది. అలాగే న్యాయనిపుణుల సలహా తీసుకున్న అనంతరం కేసీఆర్ పంపిన లేఖకు సమాధానమిచ్చింది.

**అసెంబ్లీ రికార్డుల ప్రకారం ఇదే మీ చిరునామా**

కేసీఆర్ విజ్ఞప్తిని తిరస్కరించిన కారణాల గురించి సిట్ తన రిప్లైలో పేర్కొంది. ఎన్నికల అఫిడవిట్, శాసనసభ రికార్డుల్లో మీ నివాస చిరునామా(నందినగర్)కే 160 సీఆర్పీసీ నిబంధన మేరకు నోటీస్ జారీ చేశాం. ఆ నోటీస్ సక్రమంగా అందినట్లు నమోదైంది. తర్వాత మీరు సమాధానమిచ్చారు. కేసు విషయాలకు సంబంధించిన పరిజ్ఞానం ఉన్న వ్యక్తులను సంబంధిత పోలీస్‌స్టేషన్ లేదా దాని సమీపంలోని స్టేషన్ పరిధిలో విచారణకు హాజరు కావాలని ఆదేశించొచ్చు. అందుకే అధికారిక రికార్డుల్లోని మీ హైదరాబాద్ నివాస చిరునామాలోనే విచారించేందుకు సిద్ధంగా ఉన్నాం. దర్యాప్తు అవసరాలు, మీ వయసును దృష్టిలో ఉంచుకొని విచారణస్థలంగా నందినగర్ నివాసాన్ని నిర్ణయించాం. అధికారిక రికార్డుల ప్రకారం మీ నివాసం కానటువంటి.. ఇతర ప్రదేశంలో విచారణ నిర్వహించాలన్న మీ అభ్యర్థనను ఆమోదించడం లేదు.

ఈ విచారణలో అనేక ఎలక్ట్రానిక్ ఉపకరణాలతో పాటు సున్నిత స్వభావమున్న పత్రాలు ఉపయోగించాల్సి ఉంది. వాటన్నింటినీ ఎర్రవల్లికి తరలించడం కష్టతరమవుతుంది. విచారణ నిమిత్తం నందినగర్ నివాసంలో ఆదివారం మధ్యాహ్నం తప్పనిసరిగా అందుబాటులో ఉండగలరు.

# మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి.



● ఎన్నికల వ్యయ పరిశీలకురాలు లావణ్య.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 30,**జిల్లాలో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శక వాతావరణంలో సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు పూర్తి బాధ్యతతో తమ విధులను నిర్వర్తించాలని మున్సిపల్ ఎన్నికల వ్యయ పరిశీలకురాలు లావణ్య సూచించారు.

శుక్రవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై ఏఈఓలు, తహసీల్దార్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు (ఎఫ్ఎస్టీ), స్టాటిక్ సర్వైలెన్స్ టీములు (ఎస్ఎస్టీ), వీడియో సర్వైలెన్స్ టీములు (విఎస్టీ), వీడియో వ్యూయింగ్ టీములు (వివీటీ)లతో కలిసి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ఎన్నికల వ్యయ పరిశీలకురాలు లావణ్య సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు 8, స్టాటిక్ సర్వైలెన్స్ టీములు 8, వీడియో సర్వైలెన్స్ మరియు వీడియో వ్యూయింగ్ టీములు, జీఎస్టీ అధికారులు 8 మంది, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్లు (ఏఈఓలు) 10 మందిని నియమించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్‌ను కట్టుదిట్టంగా అమలు చేస్తూ, ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన జరిగితే తక్షణమే చర్యలు తీసుకునే విధంగా అన్ని బృందాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మున్సిపల్ ఎన్నికల వ్యయ పరిశీలకురాలు లావణ్య మాట్లాడుతూ, అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా కఠిన నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సమయంలో అక్రమ నగదు, మద్యం, బహుమతులు తదితర ప్రలోభకర అంశాల పంపిణీని అడ్డుకునేందుకు ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాలు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు.

అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు, ప్రచార సామగ్రి, ర్యాలీలు, సభలు, పత్రికా ప్రకటనలు, సోషల్ మీడియా ప్రచారం వంటి అన్ని అంశాలపై సమగ్ర అవగాహనతో పర్యవేక్షణ జరగాలని ఆమె స్పష్టం చేశారు. ప్రతి అభ్యర్థి ఖర్చును ఖచ్చితంగా నమోదు చేసి, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఖర్చుల ఖాతాలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

ఎన్నికల విధుల్లో ఉన్న అన్ని బృందాలు ప్రతిరోజూ నిర్వహించిన తనిఖీలు, స్వాధీనాలు, నమోదైన కేసులు తదితర వివరాలతో కూడిన రోజువారీ నివేదికలను తప్పనిసరిగా సమర్పించాలని, చేపట్టిన ప్రతి చర్యను ఖచ్చితంగా నమోదు చేసి స్వాధీనాల వివరాలను అధికారిక రికార్డుల్లో పొందుపరచాలని ఎన్నికల వ్యయ పరిశీలకురాలు లావణ్య ఆదేశించారు.

ఎన్నికల నిర్వహణలో ఎటువంటి చిన్న నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె సూచించారు.

ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎన్నికల నిర్వహణకు నియమిత వివిధ బృందాల సభ్యులు పాల్గొన్నారు.

# పోటీ ప్రపంచంలో ముందుండాలి



**సీకే న్యూస్ జనవరి 30 శుక్రవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్:**పోటీ ప్రపంచంలో ముందుండాలి అని ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు ఉపన్యాసకులు ప్రశాంత్ అన్నారు, ఎన్.ఎస్.ఎస్ శీతాకాల ప్రత్యేక శిబిరంలో భాగంగా యు.పి.ఎస్ ఎల్కుర్తి పాఠశాల ఆవరణలో చుట్టు పరిసర ప్రాంతంలో పచ్చదనం పరిశుభ్రత చేపట్టారు పాఠశాలకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు మరియు పాఠశాల ఆవరణలో శుభ్రం చేశారు మధ్యాహ్నం జరిగిన సమావేశంలో తెలుగు ఉపన్యాసకులు ప్రశాంత్ ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్స్ ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్స్ పోటీ ప్రపంచంలో తట్టుకునే విధంగా తయారు కావాలని అదేవిధంగా వివిధ స్థాయిలో ఉన్నటువంటి ఉద్యోగాల గురించి వివరించారు, వాలంటీర్స్ మిగతా విద్యార్థుల కంటే పోటీ ప్రపంచంలో తట్టుకొని ఉన్నతమైనటువంటి స్థాయిలో ఉద్యోగాలు పొందాలని, మంచి అలవాట్లు ,అభిరుచులను ఏర్పరచుకోవాలని ఈ ఎన్.ఎస్.ఎస్ ఉన్నతమైనటువంటి ఉద్యోగాలు పొందాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.రాజ్ కుమార్ , అధ్యాపకులు రాజేందర్ పాల్గొన్నారు.

# కౌన్సిలర్ గా బరిలోకి దిగుతున్న కలాం వీరుడు.

● 13వ వార్డు నుండి బరిలోకి దిగుతున్న రాయల పోలయ్య...



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / అశ్వరావుపేట ప్రతినిధి, ( సాయి కౌశిక్), జనవరి 30,**అశ్వరావుపేట మొట్టమొదటి మున్సిపల్ ఎన్నికల్లో 13వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థిగా ఆధార్ పార్టీ నుండి పోటీ చేస్తున్న రాయల పోలయ్య. అందరిని కలుపుకొని పోయే మనస్తత్వం ఉన్న రాయల పోలయ్య జర్నలిస్టుగా అందరికీ సుపరిచితుడే అందరి అభిమానాన్ని చూరగొన్నా పోలయ్య మొట్టమొదటిసారిగా అశ్వరావుపేటలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ఆధార్ పార్టీ నుండి 13వ వార్డు కౌన్సిలర్ గా పోటీ చేస్తున్నారు. మూడవరోజు నామినేషన్ పత్రాలను దాఖలు చేసిన రాయల పోలయ్య . జర్నలిస్టుగా అధికారులకు ప్రజాప్రతినిధులకు రాజకీయ నాయకులు అందరికీ తెలిసినవాడుగా నోట్లో నాలుకల ఉండే పోలయ్య కు అవకాశం రావడం దాన్ని సద్వినియోగపరచుకోవడం ఆయనకి కలిసివచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతున్న రాయల పోలయ్యను ఆశీర్వదించాల్సిందిగా 13వ వార్డు ఓటర్లను అభ్యర్థిస్తూ మీడియా ద్వారా వేడుకుంటున్నారు. మరి రాయల పోలయ్య గెలుపులో మనం కూడా ఒక అడుగు ముందు కు వేద్దాం.

# లచ్చగూడెంలో పౌర హక్కుల దినోత్సవం



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం లచ్చగూడెం గ్రామం చింతకాని మండలంలో నిర్వహించడం జరిగింది

ఈ సందర్భంగా ఎంఆర్ఓ బాబ్జి ప్రసాద్ గారు మాట్లాడుతూ పౌర హక్కుల పై అవగాహన సదస్సు లచ్చగూడెం లో నిర్వహించడం వల్ల ప్రజలు పౌర హక్కుల గురించి తెలుసుకొని చైతన్యవంతులవుతారని ఇంకా ఏమైనా సాంఘిక దురాచారాలు కులవివక్షత తక్కువ ఎక్కువ అనే బేధాభిప్రాయాలు మీ పట్ల ఎవరైనా చూపినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరినారు

అదేవిధంగా సంక్షేమ అధికారి కొత్త వెంకటేశ్వరరావు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి గ్రామ ప్రజలకు వివరించడమైనది ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె రజిని ఉప సర్పంచ్ పి సీతయ్య పాలకవర్గ సభ్యులు టి సుధాకర్ ఆర్ ఐ బి జగదీష్ మరియు పంచాయతీరాజ్ శాఖ వైద్య శాఖ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# దేవనూరులో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం



**సీకే న్యూస్ జనవరి 30 శుక్రవారం ధర్మసాగర్ మండలం జిల్లా హనుమకొండ ప్రతినిధి కమలాకర్**

స్థానిక దేవునూర్ గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ , పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించనైనది.ఈ శిబిరాన్ని గ్రామసర్పంచ్ హింగే రవీందర్, ఉపసర్పంచ్ రాపాక రాజు, మండల పశు వైద్యాధికారి డా.. ఓ.భూమయ్య, మడికొండ పశు వైద్యాధికారి డా.జి.కరుణాకర్ రెడ్డి, హాజరై శిబిరాన్ని ప్రారంభించారు . ఈ శిబిరంలో ధర్మసాగర్ పశువైద్యాధికారి ఓ.భూమయ్య , మాట్లాడుతూ లింగ నిర్ధారణ వీర్యముతో కృత్రిమ గర్భధారణ చేయించినచో ఆడ దూడలు మాత్రమే పుట్టుతాయని ,దీన్ని రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపినారు మడికొండ పశువైద్యాధికారి డా. గంట కరుణాకర్ రెడ్డి పాల్గొని పాడి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించినారు .ఈ శిబిరంలో 59పాడి పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేసి ఉచితముగా మందులు పంపిణీ చేయనైనది. 23దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది.వి. ఎల్. ఓ శ్రీనివాసరెడ్డి, జె వి ఓ మంజుల,సుదర్శన్ గోపాలమిత్ర సూపర్ వైజర్ వై.రాజేశ్వర్ రావు గోపాలమిత్రలు వలిగే రాజు, కే.కొమురయ్య ,రజాక్, అనిల్, జీ.రజాక్, మరియు ఇంటాస్ ఫార్మా ప్రతినిది శ్రీధర్, అలెంబిక్ శ్రీకాంత్, వాక్సిండా రాజు, తీనెంటా వర్షిత్ పాల్గొని ఉచితముగా మందులు పంపిణీ చేసినారు గ్రామస్తులు పాడి రైతులు పాల్గొన్నారు.

# స్పర్శ లెప్రసీ అవగాహన సదస్సు,





**జనవరి 30 (సీ కే న్యూస్) చేగుంట/** జాతీయ కుష్ఠ నిర్మూలన కార్యక్రమం (ఎన్ఎల్ఈపి) కింద "స్పర్శ" లెప్రసీ అవగాహన ప్రచారం చేగుంట పట్టణంలో ప్రారంభమైంది. ఈ ప్రచారం జనవరి 30 నుండి ఫిబ్రవరి 13 వరకు 14 రోజులపాటు కొనసాగనుంది.

జాతిపిత మహాత్మా గాంధీ కుష్ఠ వ్యాధిగ్రస్తుల పట్ల చూపిన ప్రేమ, సేవలను గుర్తు చేసుకుంటూ, ఆయన వర్ధంతి జనవరి 30న ప్రతి సంవత్సరం కుష్ఠ వ్యాధి వ్యతిరేక దినంగా పాటిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు చేగుంట మండలంలోని పీహెచ్‌సీ,జెడ్‌పీహెచ్ఎస్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాధి లక్షణాలు

ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలకు కుష్ఠ వ్యాధి లేదా అనుమానిత కేసులను గుర్తించడానికి 23 ముఖ్య సంకేతాలను వివరించారు. వాటిలో:

- చర్మంపై లేత గోధుమరంగు లేదా ఎర్రటి మచ్చలు, స్పర్శ కోల్పోవడం
- మచ్చలపై చర్మం మందం కావడం, మెరిసే జిడ్డుగల చర్మం
- చెవులపై, ముఖంపై కురుపులు, నాడ్యూల్స్
- కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవడం (మీుఘుతీశీంఱం)
- కళ్ళు మూయలేకపోవడం (ఘుస్త్రశీజూష్ట్రష్ణుశ్రీఎశీం), ముక్కులో రక్తస్రావం
- చేతులు, పాదాలలో తిమ్మిరి, నొప్పిలేని గాయాలు వస్తువులను పట్టుకోలేకపోవడం, పాదరక్షలు జారిపోవడం

వేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం

చికిత్స

కుష్ఠ వ్యాధి మైక్రోబాక్టీరియం లెప్రి అనే బాక్టీరియా వల్ల వస్తుంది. దీనిని "హ్యాన్సన్ డిసీజ్" అని కూడా అంటారు.

పిబి రకం: శరీరంపై ఐదు మచ్చల కన్నా తక్కువ ఉంటే, ఆరు నెలల్లో పూర్తిగా నయం అవుతుంది. ఎం బి రకం: ఐదు మచ్చల కన్నా ఎక్కువ ఉంటే, పన్నెండు నెలల్లో పూర్తిగా నయం అవుతుంది.

అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎండిటి మందులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. సమయానికి చికిత్స తీసుకుంటే లెప్రసీ పూర్తిగా నయం అవుతుంది, అంగవైకల్యం నివారించవచ్చు.

ప్రజలకు విజ్ఞప్తి

ఆరోగ్య కార్యకర్తలు ఇంటివద్దకు వచ్చి పరీక్షలు నిర్వహించినప్పుడు, అనుమానిత లక్షణాలు ఉన్నవారు తప్పక చూపించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

"వివక్షతను అంతం చేయడం, గౌరవాన్ని కాపాడటం" అనే నినాదంతో ఈ ప్రచారం ముందుకు సాగుతోంది.

ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా హాజరైనవారు: డాక్టర్, అనిల్ కుమార్ రెడ్డి, ఎమ్.ఓ., పీహెచ్‌సీ చేగుంట. హెచ్ఎంటి వనజ, హెచ్.ఎమ్. ఏ. సంతోష్ కుమార్, డీపీఎంఓ. ఎండి కె. అనీసుద్దీన్, సి ఎచ్ ఓ. ఎస్ఎంటి నాగమల్లేశ్వరి, పిహెచ్ఎన్ పద్మ, హెచ్.ఎస్. నాగమణి, హెచ్.ఏ. జెడ్‌పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 25 వ డివిజన్‌లో బీజేపీ అభ్యర్థి వెన్నం సతీష్ నామినేషన్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,( సాయి కౌశిక్),జనవరి 30,**భద్రాద్రి కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో 25వ డివిజన్ నుంచి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా వెన్నం సతీష్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో వార్డు ప్రజలు, మహిళలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని అభ్యర్థికి మద్దతుగా నిలిచారు.నామినేషన్ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. అభ్యర్థి వెన్నం సతీష్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు, రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు మాట్లాడుతూ 25వ డివిజన్‌లో బీజేపీ గెలుపు కోసం సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, యువత అభ్యర్థికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎన్నికల్లో ఘన విజయంసాధించాలని ఆకాంక్షించారు. నామినేషన్ అనంతరం పార్టీ శ్రేణులు నినాదాలతో ఉత్సాహంగా ముందుకు సాగారు.

# త్రిశక్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన కసిర బోయిన లింగయ్య యాదవ్ కుటుంబ సభ్యులు.

**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 30.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల.

త్రి శక్తి మాత ఆలయంలో 12వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకులు కసిర బోయిన లింగయ్య యాదవ్ కుటుంబ సభ్యులు త్రిశక్తి మాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినారు.





# త్రి శక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ జడ్పీటీసీ వాకిటీ పద్మ అనంతరెడ్డి.

**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 30 .** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా త్రి శక్తి మాత ఆలయంలో 12 వార్షికోత్సవ బ్రహ్మోత్సవంలో పాల్గొన్న మాజీ జెడ్పిటిసి వాకిటి పద్మఅనంతరెడ్డి కుటుంబ సభ్యులు త్రి శక్తి మాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినారు.

## ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయుడు తిరుపతి కృష్ణారావుకు జిల్లా కలెక్టర్ సన్మానం....



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని : ఎఫ్రీ చైల్డ్ ప్రోగ్రాంలో ప్రాథమిక పాఠశాల కొదుమూరు జిల్లా స్థాయిలో మూడవ స్థానం, చింతకాని మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన సందర్భంగా నాగులవంచ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు తిరుపతి కృష్ణారావును జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సన్మానించారు.విద్యార్థుల అభివృద్ధి కోసం కృషి చేసి పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చినందుకు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ పెన్షనర్స్ యూనియన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అంబటి శాంతయ్యతో పాటు కొదుమూరు ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మరియు మండలంలోని పలువురు ఉపాధ్యాయులు కృష్ణారావును అభినందించారు.కృష్ణారావు సేవలు ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తాయని అధికారులు పేర్కొన్నారు.

## త్రి శక్తి ఆలయంలో ప్రత్యేక పూజ లో పాల్గొన్న ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు.



**సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 30.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో త్రిశక్తి ఆలయంలో 12వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు ప్రొద్దుటూరు నరసయ్య నిర్మల మరియు వారి కుటుంబ సభ్యులు బంధుమిత్రులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినారు. అమ్మవారి ఆశీస్సులు తీర్థప్రసాదాలు తీసుకున్నారు.

## త్రి శక్తి క్షేత్రంలో 12వ వార్షిక కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం.



**సీ కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 30.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో. శ్రీ హరిహర త్రిశక్తి క్షేత్రం 12 వ వార్షిక కుంభాభిషేక మహోత్సవాలలో భాగంగా 8వ రోజు శుక్రవారం త్రిశక్తి అమ్మవార్లకు 1008 మంది మహిళలతో సహస్ర (1008)కలశాలతో వలిగొండ రామాలయం నుంచి త్రిశక్తి దేవాలయం వరకు దేదిప్యమానంగ శోభాయాత్రగ వచ్చి వారు తెచ్చిన కలశాలతోని అమ్మవార్లకు అంగరంగ వైభవంగా అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎా × యుగంధర్ గారి ఆధ్వర్యంలో పోలీసు వారు శోభాయాత్రను ఎటువంటి ఆటంకం జరగకుండా విజయవంతం చేశారు. అలాగే =ూా కార్యకర్తలు, ఆర్యవైశ్యులు, పద్మశాలిలు, అయ్యప్ప భక్తులు, పట్టణ పెద్దలు, అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సహాయ సహకారాలు అందించారు.
ఈ సందర్భంగా స్థానిక మీూా కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు ఆలయానికి విచ్చేసి అమ్మవార్లను దర్శించుకున్నారు.
అలాగే నాగారంలోని సాయికృష్ణ ఎల్డర్ కేర్ హోమ్ ఛైర్మెన్ శ్రీ సాయికృష్ణ గారు, వారి సిబ్బందితో సహా భక్తులకు భోజనాల దగ్గర ఎవరికి ఇబ్బంది జరగకుండా సహాయ సహకారాలు అందించారు. నిర్వాహకులు చేసిన ఏర్పాట్ల పట్ల భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

# ఉప్పల్ లో గాంధీ వర్ధంతి వేడుకలు.. హాజరైన మందమల పరమేశ్వర్ రెడ్డి

**సీకే న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రంజిత్ :**ఉప్పల్ గాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను శుక్రవారం నిర్వహించారు.ఉప్పల్ వార్డు ఆఫీస్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి పూలమాలలు వేసి.నివాళిఅర్పించారు.కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ రాజేందర్ బజార్ జగన్నాథ గౌడ్ గారు,ఈగ అంజనేయులు తెల్కల మోహన్ రెడ్డిగారు,ఆగం రెడ్డి,లింగంపల్లి రామకృష్ణ గారు, తుమ్మల దేవి రెడ్డి గారు భూసం రఘునాథ రెడ్డిసల్లా ప్రభాకర్ రెడ్డి.,గొరిగే మహేష్, ఖాజా మౌలాన్,పూజారి హనుమంతు ,సుమన్ రెడ్డి,బాబు,జావేద్, విజయ్ కుమార్,జంగయ్య,అన్వర్,అఫ్జల్, వహీద్,మెహన్ నాయక్, నాగారం వెంకటేష్, రాములు,నాగూర్ బాషా, తిరుపతి, బీరప్ప,భాస్కర్ రెడ్డి. గ. బోడిగే మల్లేష్,ప్రశాంత్ రెడ్డి, శివ గౌడ్ రంగుల శేఖర్, ముదిరాజ్,సాయి,చంద్ర శేఖర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



# ధన్యజీవి ఏపూరి సీతయ్య

- సీపీఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**సీపీఐ సీనియర్ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుడు నాగిలిగొండ గ్రామానికి చెందిన ఏపూరి సీతయ్య ధన్యజీవి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. నాగిలిగొండ గ్రామానికి చెందిన ఏపూరి సీతయ్య (90) బుధవారం అనారోగ్యంతో మరణించిన విషయం విదితమే. ఆయన మరణవార్త తెలుసుకున్న కూనంనేని శుక్రవారం నాగిలిగొండ లోని ఆయన నివాసానికి వెళ్లి సీతయ్య, మృతదేహంపై పార్టీ జెండా ఉంచి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ సీతయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో కొరియర్ గా పనిచేశారని, బ్రతికినంతకాలం ఎర్రజెండా ని ఎత్తుకొని పార్టీ అభివృద్ధి కోసం ఎంతగానో కృషిచేశాడన్నారు.ఈ ప్రాంతంలో కమునిస్టు ఉద్యమం బలపడటానికి సీతయ్య పాత్ర ఎనలేనిదన్నారు. సీతయ్య కుటుంబం కూడా తండ్రి బాటలోనే నడుస్తుందన్నారు. సీతయ్య కుమారుడు రవీంద్రబాబు జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పనిచేస్తున్నాడన్నారు. సీతయ్య కుటుంబానికి సానుభూతి తెలియజేశారు.
నివాళులర్పించిన వారిలో పార్టీ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండవర్తి గోవిందరావు, ఎర్రా బాబు దొండపాటి రమేష్, ఏపూరి లతాదేవి, పోటు కళావతి, ఏనుగు గాంధీ, పావులూరి మల్లిఖార్జునరావు, కూచివుండి రవి. ఏనుగు వెంకటేశ్వరరావు. పార్టీ మండల కార్యదర్శి దూసరి





గోపాలరావు, సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్ జిలా కౌన్సిల్ సభ్యులు రాసాల మోహన్ రావు, తాటి నిర్మల, కన్నెబోయిన విజయమ్మ, ఏసు, నేరడ, బస్వాపురం సర్పంచులు దూసరి నేతాజీ, ఆవుల నర్సింహారావు, సిపిఐ నాయకులు తాళ్లూరి యాదగిరి, తాళ్లూరి పుల్లయ్య, బొడ్డు కొండలరావు, నక్కనబోయిన కృష్ణ నారపోగు నాగార్జున నాగిలిగొండ శాఖ కార్యదర్శి చాట్ల రమేష్ , బాబు, ముఖర్జీ, షేక్ హుస్సేన్, ఏపూరి నర్సయ్య తదితరులు నివాళు లర్పించారు.

# తండ్రి కోరిక నెరవేర్చిన తనయుడు...

- భద్రాచలం ఏజెన్సీలో, డాక్టర్ పట్టా పొందిన దళిత విద్యార్థి...
- అంబేద్కర్ ఆలోచన విధానమే లక్ష్యంగా ముందుకు వెళ్లిన హర్ష...
- ప్రైవేట్ ఆసుపత్రి లో కాంపౌండర్ గా, ఒక అంబులెన్స్ ఓనర్ గా తండ్రి కష్టాలు చూసి డాక్టర్ లక్ష్యంగా కష్టపడ్డ హర్ష...

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,( సాయి కౌశిక్),జనవరి 30,**భద్రాచలం కు చెందిన బాచి పోగు శ్రీనివాస్ భద్రాచలంలో గత 30 సంవత్సరాలుగా బస్టాండ్ వెనుక గల ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో కాంపౌండర్ గా పని చేస్తూ, ప్రైవేట్ అంబులెన్స్ నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తూ, తాను సాధించలేనిది తన లక్ష్యాన్ని తన కొడుకు ద్వారా సాధించాలని ఎంతో కష్టపడి, కొడుకుని చదివిస్తూ చిన్ననాటి నుంచి అతడు ఏ లక్ష్యం చేరుకోవాలో అతనికి చెప్తూ జీవనం కొనసాగిస్తూ ఉన్నాడు, తండ్రి మాటే శిరోధార్యంగా తండ్రి లక్ష్యాన్ని చేరుకోవాలని బాచిపోగు సాయి వెంకట హర్ష తనదైన శైలిలో కష్టపడుతూ ఒక దళిత కులంలో పుట్టి అంబేద్కర్ ఆలోచన విధానాన్ని పాటిస్తూ చదువు తప్ప వేరొకటి ఏదీ ఉండదు మన తలరాతలు మారాలన్న, పేద ప్రజలకు సేవ చేయాలన్న, తండ్రి ఆశయం నెరవేర్చాలన్న కష్టపడి చదవాలన్న ఆకాంక్షతో రాత్రి పగళ్ళు కష్టపడి చదివి ఈరోజు డాక్టర్



పట్టా పొంది, గర్వంగా తన విజయాన్ని తన తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులకు అందజేసిన సాయి వెంకట హర్షను కుటుంబ సభ్యులే కాకుండా, మిత్రులు బంధువులు కూడా అభినందించారు... కొడుకు సాధించిన విజయానికి తల్లిదండ్రులు ఆనందంతో సంతోషంతో కన్నీరు పరవంతమైనారు....

# యువత క్రీడా స్ఫూర్తిని పెంచు కోవాలి.




**టి.రమ, మండల విద్యాశాఖ అధికారి, భద్రాచలం మండలం.**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 30,**భద్రాచలం మండలంలో సీఎం కప్ ముగింపు సమావేశం ఘనంగా నిర్వహించబడింది. జనవరి 29,30 రెండు రోజులపాటు భద్రాచలం జూనియర్ కళాశాల గ్రౌండ్ నందు నిర్వహించబడిన సీఎం కప్ ముగింపు సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి, టి .రమ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండి క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని, క్రీడల ద్వారా శారీరక దారుఢ్యాన్ని అభివృద్ధి పరచుకోవాలని, క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం పెంపొందించబడుతుందని మరియు నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని తెలియజేశారు. ఈ రెండు రోజులపాటు జరిగిన క్రీడలకు సహకరించిన భద్రాచలం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కృష్ణ గారికి, వార్డ్ మెంబెర్ శరత్ గారికి,మండల అభివృద్ధి అధికారి గారికి, మండల గారికి, భద్రాచలం టౌన్ పోలీస్ శాఖ అధికారులకు, గ్రామపంచాయతీ సిబ్బందికి మరియు మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయుల కు ధన్యవాదాలు తెలియజేశారు.
క్రీడలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మండల విద్యాశాఖ అధికారి చేతుల మీదగా మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎం కప్ క్లస్టర్ ఇంచార్జ్ రమేష్, జగదీష్ కాలనీ ప్రధానోపాధ్యాయులు రాజా శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు రాంబాబు, రమణ, సుజాత,సరిత, ప్రసాదు, జూనియర్ కళాశాల సిబ్బంది శ్రీనివాసరావు గారు మరియు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## త్రి శక్తి ఆలయంలో ప్రత్యేక పూజలలో పాల్గొన్న బెలీదే కుశకుమార్ కుటుంబ సభ్యులు బంధుమిత్రులు.





**సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 30.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో త్రి శక్తి మాత ఆలయంలో 12వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవంలో పాల్గొన్న బెలిదే కుశకుమార్ బెలిదే గోపి బెలేదే వెంకటేశం కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినారు.

# మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

- సంక్షేమ పథకాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయి
- అలియాబాద్ మున్సిపాలిటీ లాల్‌గడి మలక్‌పేట్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



**సీకే న్యూస్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రంజిత్**
మేడ్చల్ నియోజకవర్గం, అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని లాల్‌గడి మలక్‌పేట్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ గారు ప్రారంభించారు.ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ గారు మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రజల్లో విశ్వాసం పెరిగిందని, అదే పార్టీ విజయానికి బాటలు వేస్తుందని అన్నారు.వజ్రెష్ యాదవ్ గారి తో పాటు టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి గారు, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గారు, సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ గారు, అంజి రెడ్డి గారు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి గారు, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు ముజీబుద్దీన్ గారు, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ గారు, మున్సిపాలిటీ అధ్యక్షులు తుంకి రమేష్ గారు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేటి నుంచే పొంగులేటి ప్రచార హోరు

**ఏదులాపురం మున్సిపాలిటీలో మంత్రి పర్యటన ఖరారు**

**వార్డుల వారీగా ప్రచార షెడ్యూల్ విడుదల**



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం :** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రేపటి (శనివారం) నుంచి ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో విస్తృతంగా పర్యటించనున్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన వార్డుల వారీగా పర్యటిస్తూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఈ మేరకు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి పర్యటనకు సంబంధించిన వివరాలను శుక్రవారం రాత్రి ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 07:30 గంటలకు 6వ వార్డులో పర్యటన ప్రారంభం కానుంది. అనంతరం 08:00 గంటలకు 5వ వార్డులో,08:30 గంటలకు 4వ వార్డులో ఆయన పర్యటిస్తారు. ఉదయం 09:00 గంటలకు 3వ వార్డు, 25వ వార్డుల్లో మంత్రి ప్రచారం నిర్వహించనున్నారు. కావున ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు ఇన్ చార్జ్ లు, జోనల్ ఇన్ చార్జ్ లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని దయాకర్ రెడ్డి కోరారు. మంత్రి పర్యటన నేపథ్యంలో ఆయా వార్డుల్లో స్థానిక నాయకులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

# మీరు హామీ ఇవ్వండి.. నెరవేర్చే బాధ్యత నాది!

**ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల సమావేశంలో మంత్రి పొంగులేటి**



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం :** "వార్డుల్లోకి వెళ్ళండి.. జనం సమస్యలను గుండెలకు హత్తుకోండి.. పరిష్కరిస్తామని గట్టిగా హామీ ఇవ్వండి.. వాటిని నెరవేర్చే బాధ్యత తనది" అంటూ తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఏదులాపురం అభ్యర్థులకు స్పష్టం చేశారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో 32 వార్డుల అభ్యర్థులు, ఇన్-చార్జులతో శుక్రవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల వారీగా సమావేశం నిర్వహించిన మంత్రి మాట్లాడుతూ... మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంటే, ఏదులాపురం రూపురేఖలను మారుస్తానని మంత్రి చెప్పారు. అభివృద్ధిలో ఏదులాపురాన్ని రాష్ట్రానికే ఒక దిక్సూచిగా, ఆదర్శ మున్సిపాలిటీగా నిలబెట్టే బాధ్యత తనదేనని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధిలో ఏదులాపురాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ప్రచారంలో భాగంగా ప్రతి వార్డులోనూ తాను స్వయంగా పర్యటించి ప్రచారం నిర్వహిస్తానని వెల్లడించారు. ప్రత్యర్థుల ఎత్తుగడలను చిత్తు చేస్తూ, దూకుడుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వార్డు, జోనల్ ఇన్-చార్జులు, అభ్యర్థులు సమన్వయంతో ప్రతి ఓటరును కలిసి కాంగ్రెస్ వైపు తిప్పుకోవాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ ఫలాలను వివరిస్తూనే, అభివృద్ధి పట్ల వారికున్న నిబద్ధతను చాటిచెప్పాలన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకోవడమే ఏకైక లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని మంత్రి పొంగులేటి దిశానిర్దేశం చేశారు.

# బెల్లం మార్కెట్ యార్డ్ లో అట్టహాసంగా ప్రారంభం అయిన పుష్ప ప్రదర్శన





● ప్రారంభించిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు, కొల్లు రవీంద్ర, సిఎం రమేష్, జిల్లా కలెక్టర్.

**అనకాపల్లి, సి కే న్యూస్జనవరి 30;** అనకాపల్లి ఉత్సావ్ లో బాగంగా విఎంఆర్డీఎ ఆధ్వర్యంలో జిల్లా ఉధ్యాన, మార్కెటింగ్, జివిఎంసి సహకారంతో పట్టణం లోని ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు చేసిన పుష్ప ప్రదర్శనను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ శాసన సభా స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, జిల్లా ఇంచార్జి మంత్రి మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ డాక్టర్ సి ఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, విఎంఆర్డీఎ కమిషనర్ ఎస్.తేజ్ భరత్ లతో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ పుష్ప ప్రదర్శన ఎంతో నయనానందకరంగా ఉందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనకాపల్లి జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయడం పై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని, అందులో భాగంగానే ఈ అనకాపల్లి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని అన్నారు. పుష్ప ప్రదర్శనని అతి తక్కువ సమయంలో విజయ వంతం చేసిన జిల్లా యంత్రాంగానికి, పాత్రికేయ మిత్రులకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. అనకాపల్లి జిల్లా పర్యాటక శాఖలో బాగంగా బీచ్ లను, టెంపుల్ టూరిజంని అభివృద్ధి పరిచి, ప్రజల ఒత్తిడి తగ్గించడానికి టూరిజం బాగా ఉపయోగ పడుతుందన్నారు. ఎంపీ డాక్టర్ సిఎం రమేష్ మాట్లాడుతూ అనకాపల్లి ఉత్సవాలను ప్రజలందరూ ఆస్వాదిస్తున్నారని తెలిపారు. జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయడం పై ప్రత్యేక ద్రుష్టి పెడతామన్నారు. ప్రజలందరూ ఆనందంగా ఉండాలని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమలు చేస్తాం అన్నారు. ఎటువంటి అవంతరాలు లేకుండా ఈ పుష్ప ప్రదర్శనను విజయవంతం చేసిన స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామ కృష్ణ కి, జిల్లా యంత్రాంగానికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ నేడు, రేపు రెండు రోజుల వరకు స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డ్ లో పుష్ప ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. ప్రవేశం ఉచితమని, సందర్శకులు తప్పక వినియోగించు కోవాలని తెలిపారు. అనంతరం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించిన స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, జిల్లా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ డాక్టర్ సి ఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, విఎంఆర్డీఎ కమిషనర్, చైర్మన్ ఎస్. తేజ్ భరత్, ప్రణవ్ గోపాల్. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మెన్లు పీలా గోవిందా సత్యనారాయణ, మళ్ళా సురేంద్ర బాబు, బత్తుల తతీయ్య బాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా నాగ జగదీష్, విఎంఆర్డీఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్, డి సి ఎం ఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, జిల్లా ఉద్యన శాఖ అధికారి ఎ.రాజా శేఖరం, పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు కళ్యాణి, అనకాపల్లి ఆర్డీఓ షేక్ అయిషా, డి ఎస్పీ శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.



# కోడుమూరులో సిఎం కప్ 2026 మండలస్థాయి ఆటల పోటీలు





**సి.కె న్యూస్, చింతకాని ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనముల రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జవీ జబజూ 2026 మండల స్థాయి ఆటల పోటీలు అనగా ది 30.01.2026 న చింతకాని మండలంలో కొదుమూరు ఉన్నత పాఠశాల లొ ఘనంగా ప్రారంభించడంజరిగింది. మండల విద్యాశాఖ అధికారి అధ్యక్షతన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోడుమూరు ప్రధానోపాధ్యాయులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ,మండల తహసీల్దార్ గారు, కోడుమూరు సర్పంచ్ గారు, ఉపసర్పంచ్ ప్రారంభించారు. మండల స్థాయి పోటీలునిర్వహించడం జరుగుతుంది ప్రతిభ కలిగిన క్రీడా కారులను ఎంపిక చేయడం జరుగుతుంది వీరిని మధిర అసంబ్లీ స్థాయి పోటీలలో పాల్గొనేటట్లు గా టీమ్స్ ను తయారు చేసినారు. కబడ్డీ(ఎవఅ షశీఎవఅ) విభాగంలో లచ్చగూడెంక్లస్టర్ విన్నర్స్ గాను పందిళ్లపల్లి క్లస్టర్ రన్నర్స్ గాను, ఖో ఖో,(ఎవఅ, షశీఎవఅ)కోడుమూరు విన్నర్స్, లచ్చ గూడెం రన్నర్స్,. వాలీబాల్ (ఎవఅ, షశీఎవఅ)కోడుమూరు విన్నర్స్, లచ్చ గూడెం, పందిళ్లపల్లి రన్నర్స్ గాను గెలుపొందారు. బహుమతులు పంపిణి కార్యక్రమం లో చీఫ్ గెస్ట్ గా ఎవశీ హై స్కూల్ హెచ్ఎం , మరియు పీడీలు, పి ఈ టి లు,వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు అదేవిధంగా,వివిధ గ్రామాల నుండి సుమారు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

# మధిర నియోజకవర్గానికి పల్లె రహదారుల సుమారు 85 కిలోమీటర్ల బీటీ నిర్మాణానికి 173 కోట్ల 60 లక్షల రూపాయల నిధులు

● భట్టి విక్రమార్క కి మధిర నియోజకవర్గ ప్రజల హృదయపూర్వక కృతజ్ఞతలు.

● గ్రామీణ అభివృద్ధికి బలమైన అడుగు.!


GOVERNMENT OF TELANGANA
ABSTRACT
PR&RD Dept. - Khammam District - Road proposals with an Estimate cost for Rs.17360.00 Lakhs - under CRR (Plain) 2025-26 Grant - Administrative Sanction - Accorded - Orders - Issued.
PANCHAYAT RAJ & RURAL DEVELOPMENT (ROADS) DEPARTMENT
Dated:27.01.2026
Read:
From the ENC, PR, Hyderabad Lr.No.AEE/DEEIII/Proposals/ Madhira/Khammam/2024, dated 03.11.2025.
In the reference cited, the ENC, PR, Hyderabad has submitted the proposal to accord Administrative Sanction for (33) works in Madhira Constituency, Khammam District with an Estimate cost for Rs.17360.00 Lakhs under CRR (Plain) 2025-26 Grant.
Total- 84.65 17360.00




**సి కే న్యూస్.** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా, మధిర నియోజకవర్గంలోని పల్లెలకు ఆధునిక రహదారి సౌకర్యాలు కల్పించేందుకు భారీ ఎత్తున నిధులు మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.

ఎన్నో ఏళ్లుగా గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపే విధంగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయం. పల్లె నుంచి పట్టణానికి, రైతు పొలం నుంచి మార్కెట్‌కు, విద్యార్థి బడికి, అనారోగ్యం పాలైన వారు ఆసుపత్రికి ప్రతి అవసరానికి రహదారి కీలకమైనది. అలాంటి కీలకమైన మౌలిక వసతుల అభివృద్ధికి ఈ నిధులు ఒక మైలురాయిగా నిలవనున్నాయి.

మధిర నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల్లో రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనుల ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా, రైతుల తమ వ్యవసాయ భూముల విలువ పెరగనుంది, రైతులకు తమ పంటలను మార్కెట్‌కు సులభంగా తీసుకెళ్లే అవకాశం కలుగుతుండగా, యువతకు ఉపాధి అవకాశాలు మరింత విస్తరించనున్నాయి.

ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తన పాదయాత్రలో అర్థం చేసుకుని, వాటికి ప్రభుత్వ స్థాయిలో పరిష్కారం చూపడంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క చొరవ, నిబద్ధత ప్రశంసనీయం. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ఆయన నాయకత్వం మధిర ప్రాంతానికి ఒక వరంగా మారిందని ప్రజలు భావిస్తున్నారు.

మధిర నియోజకవర్గంలోని గ్రామీణ మౌలిక వసతుల బలోపేతానికి తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయానికి గాను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క కి మధిర నియోజకవర్గ ప్రజలు మరోసారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు.

# పైనాపిల్‌ను తింటే.. అది మనల్ని తింటుందా..!



బరువు తగ్గాలనుకునే వారికి, జీర్ణక్రియ మెరుగుపడాలని కోరుకునే వారికి పైనాపిల్ ఒక అద్భుతమైన వరం. విటమిన్-సి, యాంటీ ఆక్సిడెంట్లతో నిండిన ఈ పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కానీ చాలామంది దీనిని తినడానికి భయపడుతుంటారు.. కారణం నాలుక దురద. పైనాపిల్..చూడగానే నోరూరించే పండు.. తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు. కానీ పైనాపిల్‌ను ఒక్క ముక్క నోట్లో పెట్టుకోగానే నాలుకపై చిన్నపాటి మంట, దురద లేదా ఏదో గుచ్చుకున్నట్లు అనిపిస్తుంది. చాలామంది ఇది పండులో ఏదైనా లోపం ఏమో అని భయపడతారు. కా, దీని వెనుక ఒక ఆసక్తికరమైన జీవక్రియ దాగి ఉంది. పైనాపిల్‌లో బ్రోమెలైన్ అనే శక్తివంతమైన ఎంజైమ్ ఉంటుంది. ఇది ప్రోటీన్లను విచ్ఛిన్నం చేయడం సిద్ధహస్తురాలు. సాధారణంగా మనం ఆహారాన్ని జీర్ణం చేసుకుంటాం.. కానీ పైనాపిల్ విషయంలో.. మనం దానిని నములుతున్నప్పుడు, అందులోని బ్రోమెలైన్ మన నోటిలోని సున్నితమైన కణజాలం, నాలుకపై ఉండే ప్రోటీన్లను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తుంది. అంటే సాంకేతికంగా చెప్పాలంటే.. మనం పైనాపిల్‌ను తింటుంటే, పైనాపిల్ మనల్ని తింటుందన్నమాట. అయితే ఈ దురదను చూసి కంగారు పడక్కర్లేదు. ఈ ఎంజైమ్ మన కడుపులోకి వెళ్లగానే అక్కడి జీర్ణ రసాల వల్ల అది జీర్ణమైపోతుంది. నిజానికి ఇది జీర్ణక్రియకు, శరీరంలో వాపులను తగ్గించడానికి ఎంతో మేలు చేస్తుంది. మన నోటిలోని కణాలు చాలా వేగంగా పునరుత్పత్తి చెందుతాయి. అందుకే పైనాపిల్ తిన్న తర్వాత కలిగే ఆ మొద్దుబారినట్లు ఉండే అనుభూతి కొద్దిసేపట్లోనే తగ్గిపోతుంది. పైనాపిల్ రుచిని ఆస్వాదిస్తూనే, ఆ దురద నుండి తప్పించుకోవడానికి ఇక్కడ కొన్ని చిట్కాలు ఉన్నాయి. ఉప్పు నీటి చిట్కా: పైనాపిల్ ముక్కలను కోసిన తర్వాత కొద్దిసేపు ఉప్పు నీటిలో నానబెట్టండి. ఉప్పు బ్రోమెలైన్ ప్రభావాన్ని తగ్గిస్తుంది. వేడి చేయడం: పైనాపిల్‌ను గ్రిల్ చేసినా లేదా ఉడికించినా అందులోని ఎంజైమ్లు నిర్వీర్యం అవుతాయి. అందుకే పైనాపిల్ పిజ్జా తిన్నప్పుడు నాలుక దురద పెట్టదు. పండిన పండునే ఎంచుకోండి: పచ్చి పైనాపిల్‌లో ఈ ఎంజైమ్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. పండు బాగా పండిన తర్వాత తింటే ఈ సమస్య తక్కువగా ఉంటుంది. మధ్య భాగం వద్దు: పైనాపిల్ మధ్యలో ఉండే గట్టి భాగంలో బ్రోమెలైన్ ఎక్కువగా ఉంటుంది. దానిని పక్కన పెడితే దురద తగ్గుతుంది. ఇందులో క్యాలరీలు తక్కువ, ఫైబర్ ఎక్కువ ఉండడం వల్ల బరువు తగ్గాలనుకునేవారికి మంచిది. విటమిన్-సి పుష్కలంగా ఉండటం వల్ల జలుబు, దగ్గు వంటి సమస్యల నుండి కాపాడుతుంది. ఇందులో ఉండే మాంగనీస్ ఎముకలను బలంగా ఉంచుతుంది.


# చిన్న ముక్క అల్లం తింటే ఇన్ని లాభాలా!



అల్లం కేవలం వంటకు రుచిని ఇవ్వడమే కాదు, అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమెటరీ గుణాలు జలుబు, నొప్పులను తగ్గిస్తాయి. రోగనిరోధక శక్తిని పెంచి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. బరువు తగ్గడానికి, కొలెస్ట్రాల్ నియంత్రణకు, రక్తంలో చక్కెర స్థాయిలను క్రమబద్ధీకరించడానికి అల్లం తోడ్పడుతుంది. మీ రోజువారీ ఆహారంలో చేర్చుకుంటే మంచి ఆరోగ్యం సొంతం. అల్లం వంటలకు కేవలం మంచి రుచిని ఇవ్వడమే కాదు.. ఇంకా అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అల్లంలో ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమెటరీ గుణాలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు అల్లంతో చెక్ పెట్టొచ్చు. జలుబు, దగ్గు, తలనొప్పి, మైగ్రేన్, నడుంనొప్పి, వెన్నుపూస నొప్పి, మోకాలి నొప్పులు, జాయింట్ పెయిన్స్ వంటి సమస్యలను తగ్గించడానికి అల్లం మంచి మెడిసిన్. ఆకలిని పెంచడంలో అల్లం బాగా సహాయ పడుతుంది. ముఖ్యంగా కీమోథెరపీ, రేడియోథెరపీ, క్యాన్సర్ బాధితులకు ఆకలి తగ్గిపోతుంది. అల్లం రోగనిరోధక శక్తిని పెంచి, శరీరాన్ని వ్యాధుల నుండి రక్షిస్తుంది. చర్మాన్ని మెరిసేలా చేసి, జుట్టును బలంగా, ఒత్తుగా ఉంచుతుంది. ఒత్తిడిని తగ్గించి మనస్సును ప్రశాంతంగా

ఉంచడంలో కూడా ఇది ఎంతో సహాయపడుతుంది. ఆరోగ్యాన్ని మెరుగుపరచే ఈ సహజ ఔషధాన్ని మీ రోజువారీ జీవనశైలిలో చేర్చుకోవడం మంచిది. అలాగే ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి కొన్నిసార్లు ఆకలిగా అనిపించదు. ఇందులో నొప్పి, వాపును తగ్గించే లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. రోజుకు 2 నుంచి 5 గ్రాముల అల్లంను రెండు వారాల పాటు తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. అల్లం జీర్ణక్రియను మెరుగుపరచి, మలబద్ధకం సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. అదనపు కొవ్వును కరిగించి బరువు తగ్గడంలో సహాయపడుతుందే కాకుండా, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించి డయాబెటిక్ రోగులకు మేలు చేస్తుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో అల్లం తినడం లేదా అల్లం నీరు తాగడం శరీర డిటాక్స్‌కు సహాయపడుతుంది. ఒక నెలపాటు ప్రతిరోజూ అల్లం తినడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. అల్లంలోని పదార్థాల వల్ల రక్తంలో ట్రైగ్లిజరైడ్‌ల పరిమాణం తగ్గుతుంది

## బరువును తగ్గించే మ్యాజిక్ బ్రేక్‌ఫాస్ట్



బరువు తగ్గాలనే లక్ష్యంతో చాలామంది చేసే మొదటి పని బ్రేక్ ఫాస్ట్ మానేయడం. కానీ అది మీ ఆరోగ్యానికి మేలు కంటే కీడే ఎక్కువ చేస్తుందని మీకు తెలుసా? బరువు తగ్గడానికి బ్రేక్‌ఫాస్ట్ మానేయడం కాదు.. అసలు ఏం తింటున్నామన్నదే ముఖ్యం. ఉదయం పూట మీరు తీసుకునే ఆహారమే మీ రోజంతటి వేగాన్ని, మీ జీవక్రియను నిర్ణయిస్తుంది. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది చేసే అతిపెద్ద తప్పు బ్రేక్ ఫాస్ట్ విషయంలో అశ్రద్ధ చూపడం. మరికొందరు బరువు తగ్గాలనే ఉద్దేశంతో అసలు టిఫినే తినరు. అయితే బరువు తగ్గడానికి టిఫిన్ మానేయడం కాదు.. సరైన అల్పాహారం ఎంచుకోవడం ముఖ్యమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. శరీరానికి రోజంతా అవసరమైన శక్తిని ఇచ్చేది, జీవక్రియను వేగవంతం చేసేది అల్పాహారమే. మరి బరువు తగ్గడానికి ఎలాంటి బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవాలి? బరువు తగ్గాలనుకునే వారికి మొలకెత్తిన పప్పులు ఒక అద్భుతమైన ఎంపిక. ఇందులో ప్రోటీన్ మరియు ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. నానబెట్టిన పచ్చి పప్పు లేదా శనగలను మొలకలు వచ్చిన తర్వాత అందులో ఉల్లిపాయ, టమోటా, దోసకాయ ముక్కలు, కొంచెం నిమ్మరసం, చాట్ మసాలా కలిపి తీసుకోవాలి. ఇది తిన్న తర్వాత కడుపు నిండుగా అనిపిస్తుంది. తద్వారా అనవసరమైన చిరుతిళ్లు తినాలనే కోరిక తగ్గుతుంది. పీచు పదార్థం జీర్ణవ్యవస్థను శుభ్రం చేయడమే కాకుండా, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. ఓట్స్, చియా గింజలు, తాజా పండ్లు, బెర్రీలు, మల్టీగ్రెయిన్ బ్రెడ్ వంటివి మీ అల్పాహారంలో భాగంగా ఉండాలి. ఫైబర్ వల్ల కేలరీలు త్వరగా ఖర్చవుతాయి. ఇది అతిగా తినకుండా మిమ్మల్ని నియంత్రిస్తుంది. ఆఫీసులకు వెళ్లే వారికి, విద్యార్థులకు ఇది బెస్ట్ ఆప్షన్. అల్పాహారానికి ముందే మీ శరీరాన్ని లోపలి నుండి శుభ్రం చేసుకోవడం ముఖ్యం. ఉదయం లేవగానే ఒకటి లేదా రెండు గ్లాసుల గోరువెచ్చని నీరు తాగాలి. ఇది శరీరంలోని విషపూరిత వ్యర్థాలను బయటకు పంపివేస్తుంది. సాధారణ టీ, కాఫీలకు బదులుగా గ్రీన్ టీ లేదా హెర్బల్ టీలను ఎంచుకోండి. ఇది మీ శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతూనే బరువు తగ్గడానికి సహకరిస్తుంది. బరువు పెరగడానికి ప్రధాన కారణం అల్పాహారంలో మనం వాడే నూనె, చక్కెర, అధిక కార్బోహైడ్రేట్లు. ప్యాక్ చేసిన తృణధాన్యాలు, నూనెలో వేయించిన పదార్థాలకు దూరంగా ఉండటం ఉత్తమం. సరైన సమయానికి, సరైన మోతాదులో పోషకమైన అల్పాహారం తీసుకోవడం వల్ల కేవలం బరువు తగ్గడమే కాకుండా రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చు. కాబట్టి రేపటి నుండి మీ బ్రేక్‌ఫాస్ట్ ప్లేట్‌ను ఆరోగ్యకరంగా మార్చుకోండి.

# ఆరోగ్యం కోసం పరగడుపున అదొక్కటి తింటే చాలు



చూడటానికి ఎంతో సుకుమారంగా కనిపించినా, వ్యాయామం విషయంలో మాత్రం ఆమె ఒక రోల్‌మోడల్. నిత్యం యోగా, జిమ్ వర్కవుట్లతో తన సోషల్ మీడియాలో స్ఫూర్తిని నింపే ఆ బాలీవుడ్ నటి, తాజాగా తన మార్నింగ్ రొటీన్‌కు సంబంధించిన ఒక వింత అలవాటును పంచుకుంది. సాధారణంగా ఉదయాన్నే నిమ్మరసం, తేనె లేదా గ్రీన్ టీ తాగుతుంటారు. కానీ ఈమె మాత్రం అందరికీ భిన్నంగా ఒక పచ్చి వెల్లుల్లి రెబ్బను నమిలి తింటోంది. ఆ ఘాటైన వాసన, మండే రుచిని సైతం భరిస్తూ ఆమె ఎందుకు వెల్లుల్లిని తీసుకుంటోంది? కేవలం కొన్ని వారాల నుంచి పాటిస్తున్న ఈ చిన్న మార్పు తన శరీరంలో ఎలాంటి మ్యాజిక్ చేసిందో ఆమె స్వయంగా వెల్లడించింది. ఇంతకీ సోహా అలీ ఖాన్ నమ్ముతున్న ఆ ప్రాచీన వైద్య రహస్యం ఏంటి?
వెల్లుల్లి మంత్రం.. ప్రముఖ నటి సోహా అలీ ఖాన్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక ఆసక్తికరమైన వీడియోను షేర్ చేశారు. గత కొన్ని వారాలుగా తను ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున ఒక చిన్న పచ్చి వెల్లుల్లి రెబ్బను తింటున్నట్లు ఆమె తెలిపారు. ఇది ప్రాచీన జ్ఞానం అని, ఇప్పటికీ ఇది అద్భుతంగా పనిచేస్తుందని ఆమె నమ్ముతున్నారు. ఈ అలవాటు వల్ల తన రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా, జీర్ణక్రియ మెరుగుపడిందని సోహా వివరించారు. వెల్లుల్లిని ఊరికే మింగేయడం కంటే నమిలి తినడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుందని సోహా చెబుతున్నారు. వెల్లుల్లిని నమిలినప్పుడు అందులో ఉన్న 'అల్లిసిన్' అనే సమ్మేళనం యాక్టివేట్ అవుతుంది. వెల్లుల్లిలో ఉండే శక్తివంతమైన ఆరోగ్య ప్రయోజనాలకు ఈ అల్లిసిన్ ప్రధాన కారణం. ఒకవేళ నమలడం కష్టంగా అనిపిస్తే, వెల్లుల్లిని ముక్కలుగా కోసి లేదా దంచి ఒక 10 నిమిషాల పాటు పక్కన పెట్టి, ఆ తర్వాత నీటితో కలిపి తీసుకోవాలని ఆమె సూచించారు.

## చలికాలంలో కొబ్బరి నీళ్లు తాగొచ్చా?



కొబ్బరి నీరు విటమిన్లు, ఖనిజాలు, ఎలక్ట్రోలైట్లతో నిండిన సహజ పానీయం. ఇది శీతాకాలంలో రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది, శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. చర్మానికి తేమను అందిస్తుంది. చలికాలంలో గది ఉష్ణోగ్రత వద్ద కొబ్బరి నీటిని మధ్యాహ్నం వేళ తీసుకోవడం మంచిది. కొబ్బరి నీరు విటమిన్లు, ఖనిజాలు, ఎలక్ట్రోలైట్లతో నిండిన సహజ పానీయం. ఇది మనలో ఉత్తేజాన్ని నింపడమే కాకుండా, శీతాకాలంలో ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కొబ్బరి నీళ్లలో ఉండే ముఖ్యమైన ఖనిజాలు ఈ చలికాలంలో రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. శీతాకాలంలో కొబ్బరి నీళ్లు తాగేటప్పుడు కొన్ని విషయాలు గుర్తుంచుకోవాలి. ఉదయం కంటే మధ్యాహ్నం, సూర్యకాంతి ఉన్న సమయంలో తాగడం మంచిది. కొబ్బరి నీళ్లను ఫ్రిజ్‌లో పెట్టకుండా గది ఉష్ణోగ్రత వద్ద తాగాలి. ఇలా చేయడం వల్ల జలుబు, దగ్గు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. చలికాలంలో దాహం తక్కువగా ఉన్నప్పటికీ, కొబ్బరి నీళ్లు శరీరానికి అవసరమైన హైడ్రేషన్, ఎలక్ట్రోలైట్లు అందిస్తాయి. ఇది రోగనిరోధక శక్తిని పెంచి, శరీరాన్ని చురుగ్గా ఉంచుతుంది. కొబ్బరి నీరు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడి, శీతాకాలంలో కడుపు సమస్యలను నివారిస్తుంది. చల్లని వాతావరణంలో జీర్ణక్రియ నెమ్మదిగా ఉన్నప్పుడు, కొబ్బరి నీరు కడుపును తేలికగా ఉంచడంలో తోడ్పడుతుంది. చలికాలంలో చర్మం పొడిబారకుండా లోపల నుండి తేమగా ఉంచడంలో కూడా ఇది సహాయపడుతుంది. పొటాషియం, సోడియం, మెగ్నీషియం వంటి ఎలక్ట్రోలైట్లు శరీరంలో ద్రవ సమతుల్యతను, గుండె పనితీరును,శరీర ఉష్ణోగ్రతను నియంత్రిస్తాయి.

## చలికాలంలో గుడ్డు తింటే..



చలికాలంలో శరీరాన్ని వెచ్చగా ఉంచడానికి, జలుబు, అలసట తగ్గించడానికి గుడ్లు అనువైన సూపర్ ఫుడ్ అని నిపుణులు సూచిస్తున్నారు. వీటిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు శరీరంలో వేడిని ఉత్పత్తి చేసి, జీవక్రియను చురుకుగా ఉంచుతాయి. రోగనిరోధక శక్తిని పెంచి, కండరాలను బలోపేతం చేస్తాయి. శీతాకాలం ప్రారంభం కాగానే చల్లదనం, జలుబు, అలసట వంటి సమస్యలు చాలామందిని ఇబ్బంది పెడతాయి. ఈ నేపథ్యంలో శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవడం, రోగనిరోధక శక్తిని పెంచుకోవడం అత్యవసరం. వైద్యులు, నిపుణుల అభిప్రాయం ప్రకారం, గుడ్లు చలికాలానికి అనువైన సూపర్ ఫుడ్‌గా పనిచేస్తాయి. గుడ్లలోని ఆరోగ్యకరమైన కొవ్వులు, అధిక నాణ్యత గల ప్రోటీన్లు శరీరంలో వేడిని ఉత్పత్తి చేయడానికి సహాయపడతాయి. ఇవి శరీర జీవక్రియను చురుకుగా ఉంచి, చలి ప్రభావాన్ని తగ్గిస్తాయి. ఉదయాన్నే అల్పాహారంలో గుడ్లు తీసుకోవడం వల్ల రోజంతా శరీరం వెచ్చగా ఉండటమే కాకుండా, జలుబు వల్ల కలిగే బిగుతు కూడా తగ్గుతుంది. శీతాకాలంలో శరీరానికి అదనపు శక్తి అవసరం. గుడ్లు పోషకాహారంతో నిండిన సంపూర్ణ ఆహారంగా ఉపయోగపడతాయి. తక్కువ పరిమాణంలోనే ఎక్కువ పోషణ అందించడం వీటి ప్రత్యేకత. గుడ్లలోని ప్రోటీన్ కండరాలను బలోపేతం చేసి, అలసటను తగ్గిస్తుంది. విటమిన్ డి, విటమిన్ బి12, సెలీనియం వంటి పోషకాలు రోగనిరోధక శక్తిని బలోపేతం చేసి, వైరల్ ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ కల్పిస్తాయి. అలాగే, గుడ్లలోని ప్రోటీన్, కొవ్వు కడుపు నిండిన అనుభూతిని కలిగించి, అనారోగ్యకరమైన చిరుతిండ్లను తగ్గించి బరువు నియంత్రణకు తోడ్పడతాయి. చలికాలంలో గుడ్లు తినడం అనేది కేవలం రుచికరమైన ఆహారమే కాకుండా, శరీరాన్ని వెచ్చగా ఉంచడానికి, శక్తిని అందించడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, బరువును నియంత్రించడానికి ఒక గొప్ప మార్గం. ఆరోగ్యకరమైన శీతాకాలం కోసం గుడ్లను మీ ఆహారంలో భాగం చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

## బ్రెడ్ ఆమ్లెట్, మొలకలు టిఫిన్‌కి ఏది బెస్ట్..!

బరువు తగ్గేవారికి బ్రెడ్ ఆమ్లెట్, మొలకలు రెండూ ప్రయోజనకరమే. బ్రెడ్ ఆమ్లెట్‌లో అధిక ప్రోటీన్.. ఆకలిని తగ్గిస్తుంది. అయితే తక్కువ నూనెతో, వైట్ బ్రెడ్ లేకుండా తీసుకోవాలి. మొలకలలో అధిక ఫైబర్ ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచి, కొవ్వును కరిగిస్తుంది. నిపుణుల ప్రకారం, బరువు తగ్గడానికి మొలకలు మెరుగైన ఆప్షన్. మనం ఉదయం తీసుకునే అల్పాహారం ఆ రోజంతా శరీరాన్ని యాక్టివ్‌గా ఉంచేలా చేస్తుంది. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునే వారు బ్రెడ్ ఆమ్లెట్ లేదా మొలకలు లాంటి అధిక ప్రోటీన్ ఆహారాలను తరచుగా తీసుకుంటూ ఉంటారు. ఈ రెండు ఆహారాలు బరువు తగ్గడానికి ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ, ఏది ఎక్కువ బలాన్ని చేకూరుస్తుందనే సందేహం ఉంటుంది. పోషకాహార నిపుణుల ప్రకారం, బ్రెడ్ ఆమ్లెట్ బరువు తగ్గడానికి సహాయపడుతుంది,

కానీ తక్కువ నూనెతో తయారు చేయాలి. రెండు గుడ్లు, రెండు బ్రెడ్ ముక్కల ఆమ్లెట్‌లో 250-350 క్యాలరీలు, 18-22 గ్రాముల ప్రోటీన్ ఉంటాయి. గుడ్లలోని ప్రోటీన్ ఆకలిని తగ్గిస్తుంది. అయితే, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు ఉండే తెల్ల బ్రెడ్‌కు దూరంగా ఉండాలి. మొలకలు బరువు తగ్గేవారికి మరొక అద్భుతమైన ఆప్షన్. 100 గ్రాముల మొలకల్లో కేవలం 25-50 క్యాలరీలు, 3-9 గ్రాముల ప్రోటీన్, 1.5-2 గ్రాముల ఫైబర్ ఉంటాయి. మొలకలలోని అధిక ఫైబర్ ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, కొవ్వును కరిగిస్తుంది. వీటిలో విటమిన్ సి, ఎంజైములు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. బరువు తగ్గడానికి మొలకలు ఉత్తమమని నిపుణులు అంటున్నారు. అయితే వారానికి రెండు, మూడు సార్లు బ్రెడ్ ఆమ్లెట్ తీసుకోవడం కూడా ప్రయోజనకరమే. బ్రెడ్ ఆమ్లెట్ తయారుచేసేటప్పుడు, 10 గ్రాముల కంటే ఎక్కువ నూనెను వాడకూడదు. మీకు థైరాయిడ్ లేదా మూత్రపిండాల వంటి ఆరోగ్య సమస్యలు ఉంటే, ఈ ఆహారాలను తీసుకునే ముందు తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించండి. మొత్తంగా, మొలకలు బరువు తగ్గడంలో మెరుగైన ఆప్షన్ అయినప్పటికీ, వారానికి రెండు లేదా మూడు సార్లు బ్రెడ్ ఆమ్లెట్ తినడం కూడా ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

# డార్లింగ్ ని చూసి కింగ్ భయపడుతున్నాడా?



పాన్ ఇండియాలో ఒకేసారి ఇద్దరు అగ్ర హీరోల సినిమాలు రిలీజ్ అయిన సన్నివేశం ఎలా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు. బాక్సాఫీస్ వద్ద నువ్వా? నేనా? అన్నట్లు తపలడాల్సి ఉంటుంది. ఏ సినిమాకు బ్లాక్ బస్టర్ టాక్ వస్తే ఆ సినిమాదే అప్పర్ హ్యాండ్. యావరేజ్ టాక్ వచ్చినా సినిమా సక్సస్ ఫుల్ చిత్రం ముందు నిలబడటం కష్టం. ఇలాంటి సన్నివేశాన్ని షారుక్ ఖాన్ ఓసారి చూసారు. ఓ ఏడాది షారుక్ ఖాన్ నటించిన -డంకీ-, ప్రభాస్ నటించిన -సలార్- చిత్రాలు ఒకేసారి రిలీజ్ అయ్యాయి. అప్పటికే షారుక్ ఖాన్ -పఠాన్-, -జవాన్- విజయాలతో మంచి ఫాంలో ఉన్నాడు.ఆ రెండు సినిమాలు 2000 కోట్లకు పైగా వసూళ్లను సాధించాయి. దీంతో రెట్టించిన నమ్మకంతో -డంకీ- చిత్రాన్ని 2023 డిసెంబర్ 21 న రిలీజ్ చేసాడు. ఆ మరుసటి రోజేనే ప్రభాస్ నటించిన -సలార్ సీజ్ ఫైర్- రిలీజ్ అయింది. అప్పటికే రెండు సినిమాల మధ్య టఫ్ ఫైట్ తప్పదని నెట్టింట మీడియా కథనాలు వెడెక్కించాయి. కానీ నిరిలీజ్ అనంతరం ప్రభాస్ వేగాన్ని షారుక్ ఖాన్ తట్టుకోలేకపోయాడు. -డంకీ- యావరేజ్ టాక్ రాగా, -సలార్- బ్లాక్ బస్టర్ టాక్ రావడంతో తేలిపోయింది. -డంకీ- 400 కోట్ల వసూళ్లను సాధించగా సలార్ 800 కోట్ల వసూళ్లతో టాప్ లో నిలిచింది.అదే -సలార్- రిలీజ్ లేని సమయంలో -డంకీ- రిలీజ్ అయి ఉంటే మంచి వసూళ్లను సాధించేదని ట్రేడ్ పండితలు అంచనా వేసారు. నార్త్ మార్కెట్ లోనే -డంకీ-పై ఆ రకంగా పంచ్ పడింది. ఈ నేపథ్యంలో తాజాగా 2027లోనూ ప్రభాస్-షారుక్ ఖాన్ తలపడే సన్నివేశం ఎదురైంది. ప్రభాస్ నటిస్తోన్న -స్పిరిట్- మార్చిలో రిలీజ్ డేట్ ను లాక్ చేసుకుంది. సరిగ్గా అదే సమయంలో షారుక్ ఖాన్ నటిస్తోన్న -కింగ్- చిత్రాన్ని కూడా రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ గత అనుభవం దృష్ట్యా కింగ్ చిత్రాన్ని ప్రీ పోన్ చేస్తున్నారు.ప్రభాస్ తో పోటీ పడటం కంటే ఇదే ఏడాది డిసెంబర్ లో క్రిస్మస్ కు రిలీజ్ చేయాలని ప్లాన్ చేసుకుంటున్నారు. హాలీవుడ్ మూవీ -అవెంజర్స్ తో పోటీ పడటానికైనా షారుఖ్ సిద్ధపడ్డారు కానీ, ప్రభాస్ - సందీప్ వంగా మాస్ సునామీకి అడ్డంగా నిలబడకూడదని ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. మరి క్రిస్మస్ రేసులో షారుఖ్ గెలుస్తాడా? లేదా? అన్నది చూడాలి. అయితే డిసెంబర్ నెల మాత్రం షారుక్ ఖాన్ కి బాగా కలిసొచ్చిన మాసం. సక్సెస్ సెంటిమెంట్ ను రిపీట్ చేస్తాడని అభిమానులు నమ్మకంగా ఉన్నారు. ఇదే సినిమాతో షారుక్ ఖాన్ తనయ సుహాన్ ఖాన్ కూడా లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే.



ప్రియాంక జవాల్కర్ టాలెంట్, ఆకర్షణ



త్రిప్తి డిమ్రీ యొక్క టైమ్‌లెస్ వైట్ మ్యాజిక్



# మహేష్ నెక్ట్స్ ఏంటి? ఆ కాంబో డౌటేనా?

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు.. ఇప్పుడు వారణాసి మూవీతో ఫుల్ బిజీగా ఉన్న విషయం తెలిసిందే. పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ గా దర్శక ధీరుడు రాజమౌళి తెరకెక్కిస్తున్న ఆ సినిమా షూటింగ్ ఇప్పుడు శరవేగంగా జరుగుతోంది. రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన ప్రత్యేక సెట్ లో జరుగుతున్న షెడ్యూల్ లో మహేష్ బాబు పాల్గొంటున్నారు. కీలక సన్నివేశాలు ఆయన ఇప్పుడు కంప్లీట్ చేస్తున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది వేసవి కానుకగా వారణాసి మూవీ రిలీజ్ కానుండగా.. ఆ తర్వాత మహేష్ బాబు ఏ సినిమా చేయనున్నారనేది ఇప్పుడు పెద్ద క్వశ్చన్ మార్క్ గా మారింది. ఎందుకంటే ఇప్పటి వరకు ఎలాంటి అనౌన్స్మెంట్ రాలేదు. సాధారణంగా చాలా మంది స్టార్ హీరోలు ఓ సినిమా చేస్తూనే.. మరో మూవీని కన్ఫర్మ్ చేస్తుంటారు. కానీ మహేష్ బాబు లైనప్ విషయంలో ఎలాంటి ప్రకటన రాకపోవడం గమనార్హం.అయితే వారణాసి తర్వాత మహేష్ బాబు.. టాలెంటెడ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో సినిమా చేయనున్నట్లు కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఎక్కడా ఎలాంటి లీక్ గానీ.. ప్రకటన గానీ రాకపోయినప్పటికీ వార్తలు మాత్రం వైరల్ అవుతున్నాయి. వారణాసి తర్వాత మహేష్, స్పిరిట్ తర్వాత సందీప్.. ఇద్దరూ కలిసి భారీ ప్రాజెక్ట్ కోసం చేతులు కలపనున్నారని అంతా అనుకున్నారు.కానీ అది జరిగేలా కనిపించడం లేదు. ఒక వేళ ఫ్యూచర్ లో మహేష్- సందీప్ కాంబినేషన్ లో మూవీ వచ్చే ఛాన్స్ ఉన్నా.. వారణాసి, స్పిరిట్ తర్వాత వారి కలయికలో సినిమా రూపొందే అవకాశాలు చాలా తక్కువగానే ఉన్నాయని చెప్పాలి. ఎందుకంటే ఇప్పటి వరకు చూసుకుంటే వారణాసి తర్వాత మహేష్ బాబు ఫ్రీగానే ఉంటారు. కానీ సందీప్ మాత్రం బిజీగా ఉండనున్నట్లు రీసెంట్ గా క్లారిటీ వచ్చింది!బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. సందీప్ వంగా తదుపరి సినిమా యానిమల్ పార్క్ అని తెలిపారు. అంతే కాదు.. ఆ మూవీ షూటింగ్ 2027లో ప్రారంభం అవుతుందని చెప్పారు. దీంతో స్పిరిట్ కంప్లీట్ అయ్యాక.. యానిమల్ పార్క్ పై సందీప్ ఫోకస్ పెట్టనున్నట్లు అర్థమైంది. అందుకే మహేష్ బాబు.. నెక్ట్స్ మూవీ సందీప్ తో ఉండదని తెలుస్తోంది.

మరి సందీప్ కాకుంటే.. మహేష్ బాబు ఎవరితో వర్క్ చేయనున్నారనేది ఇంకా ఎలాంటి క్లారిటీ లేదు. సోషల్ మీడియాలో దానిపై ఎలాంటి ఊహాగానాలు చక్కర్లు కొట్టడం లేదు. కాబట్టి మహేష్ బాబుతో వర్క్ చేసే ఛాన్స్ అందుకునే డైరెక్టర్ ఎవరనేది తెలియాల్సి ఉంది. అయితే వారణాసి రావడానికి ఇంకా ఏడాది సమయం ఉంది. కాబట్టి ఇంతలో మహేష్ నెక్ట్స్ మూవీపై ఏమైనా అప్డేట్ వస్తుందేమో వేచి చూడాలి.